
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 15 మే 2025



ఠా రెత్తిస్తున్న ఎండలు

40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు

కేంద్రం	నెల్లూరు		కావలి		కందుకూరు		ఆత్మకూరు		ఉదయగిరి	
ఉష్ణోగ్రతల వివరాలు	40.5	29.8	39	29	40	29	41	29	40	29

మరింతగా ఉంటున్న వేడి ప్రభావం ● మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి

నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎండలు ఠారెత్తిస్తున్నాయి. భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. గడిచిన కొన్ని రోజులుగా చాలా మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. అయితే వేడి ప్రభావం మాత్రం అంతకుమించే ఉంటోంది. ముఖ్యంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటల మధ్య బయట తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా సముద్ర తీరం వెంబడి ఉండటంతో చమట ప్రభావం కూడా ఎక్కువగా ఉంటోంది. బుధవారం నెల్లూరులో 40.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధికంగా బోగోలు, దగదర్తి మండలాల్లో 41.7 డిగ్రీలు ఉండగా, ఏఎస్‌పేటలో 40.8, బుచ్చిరెడ్డి పాళెంలో 40.2, కొండాపురంలో 40, మనుబోలులో 41.2, మర్రిపాడులో 40, పొదలకూరులో 40.1, వరికుంటపాడులో 40 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం ఏకంగా 26 మండలాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణాగ్రతలు రికార్డయ్యే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించింది. మరికొన్ని రోజులు కూడా ఇదే పరిస్థితి కొనసాగే ప్రమాదం కనిపిస్తోంది. ఈ ఎండ దెబ్బకు పనులు చేయలేక కార్మికులు అల్లాడుతున్నారు. ఇక వృద్ధులు, చిన్న పిల్లలు ఇళ్ల వద్దనే ఉంటున్నా ఎండ వేడిమికి తట్టుకోలేకపోతున్నారు. ఈ ఏడాది వడదెబ్బ బారిన పడుతున్నవారి సంఖ్య కూడా ఎక్కువగానే కనిపిస్తోంది. ఆసుపత్రుల్లో ఈ ప్రభావం స్పష్టంగా తెలుస్తోంది.



తలపై రుమాలు, చేతిలో నీళ్ల సీసా తప్పనిసరి

● మండుతున్న మెట్ట

అనంతసాగరం : భానుడి ప్రభావంతో మెటప్రాంతం మండిపోతోంది. వడగాడ్పులు భరించలేక పల్లెజనం అల్లాడిపోతోంది. ఉక్కపోతతో ఇటు ఇంట్లో ఉండలేక.. ప్రచండుడి భగభగలకు బయట తిరగలేక అవస్థలు పడుతున్నారు. అనంతసాగరం, మర్రిపాడు మండలాల్లో బుధవారం గరిష్ఠంగా 44 నుంచి 45 డిగ్రీల ఉష్ణాగ్రత నమోదైనట్టు సమాచారం. ఉదయం 11 గంటల నుంచే వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. వరుణుడి కరుణ కోసం పల్లెజనం ఆశగా ఎదురుచూస్తోంది.





గాంధీబొమ్మ కూడలి



వీఆర్సీ సెంటర్ లోని నీటికొలను లో ఎండిన మొక్కలు



నెల్లూరు : నిర్మానుష్యంగా ఉన్న రైల్వేస్టేషన్ ఫ్లైఓవర్ బ్రిడ్జి



ఉదయం 11 గంటలకే అనంతసాగరం బస్టాండ్ సెంటర్ ఖాళీ

జీవాల దాహార్తి.. తొట్టెలతో స్వస్తి

● జిల్లాలో యుద్ధప్రాతిపదికన నిర్మాణాలు



తొట్టెలో నీరు తాగి దాహం తీర్చుకుంటున్న జీవాలు

నెల్లూరు (జడ్పీ), మే 14 (ఆంధ్రజ్యోతి) : మండుతున్న ఎండలకు మూగజీవాల దాహం తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో నీటి తొట్టెలను నిర్మిస్తోంది.ఏర్పాటు చేస్తుంది. తొలివిడతగా 963 తొట్టెలను ఏర్పాటు చేయాలన్న లక్ష్యాన్ని అధికారులు నిర్ధేశించారు. ఒక్కో తొట్టికి రూ.22 వేల చొప్పున నిధులు మం జూరు చేస్తున్నారు. పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో వీటిని నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే సర్వేపల్లి, కోవూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి, ఆత్మకూరు, నెల్లూరు రూరల్ నియోజకవర్గాలలో 705 తొట్టెల నిర్మాణాన్ని ప్రారంభించారు. ఇందులో 322 తొట్టెల నిర్మాణం పూర్తయ్యాయి. వీటన్నిటికి స్థానిక పంచాయతీల ద్వారా నీరు సరఫరా చేసి పశువులు, జీవాలకు అందుబాటులో ఉంచుతూ వాటి దాహార్తిని తీరుస్తున్నారు. మరో 383 తొట్టెల నిర్మాణాలు పూర్తికావొస్తున్నాయి. అయితే నిధుల విడుదలలో కొంత జాప్యం జరుగుతుండటంతో పనులకు ఆటంకం ఏర్పడుతోంది. అయితే, డ్వామా పీడీ గంగాభవాని చొరవ తీసుకుని పనులు చేయిస్తున్నారు. ఈ నెలాఖరు తొలివిడత 963 తొట్టెలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

మహానాడు నిర్వహణ ఎలా!?

● సీఎం, మంత్రి లోకేష్ వేర్వేరుగా సమీక్ష

● పాల్గొన్న జిల్లా ముఖ్య నేతలు



మంత్రులు, ముఖ్యనేతలతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నెల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నుంచి జరగనున్న తెలుగుదేశం పార్టీ మహానాడు ఏర్పాట్లకు సంబంధించి బుధవారం మంగళగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ అధ్యక్షతన వేర్వేరుగా సన్నాహక సమావేశాలు జరిగాయి. జరిగింది. పార్టీ అధిష్ఠానం పిలుపుమేరకు మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి జిల్లాకు చెందిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర హాజరయ్యారు. మహానాడు ఏర్పాట్లపై సుదీర్ఘంగా వారు చర్చించుకుని, మంత్రులు, సీనియర్ నాయకులకు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో జిల్లాకు చెందిన నేతలకు మహానాడు ఏర్పాట్లకు సంబంధించి కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. ఆ తర్వాత సీఎం చంద్రబాబు జరిపిన సమీక్షలో మంత్రి ఆనంతోపాటు ఇతర మంత్రుల, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాధనాన్ని దిగమింగుతారా!?

● కోవూరు పూర్వ కార్యదర్శిపై క్రిమినల్ కేసు

● డీపీవో, డీఎల్‌పీవో, ఈవోపీఆర్డీ, సర్పంచులపైనా..

● రాష్ట్ర పంచాయత్ రాజ్ శాఖ ఉత్తర్వుల జారీ

● రూ.1,15,95,388లు పక్కదారి

కోవూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సొమ్మును తన ఖాతాకు మళ్లించుకుని దిగమింగిన ఒకప్పుడు కోవూరు పంచాయతీ కార్యదర్శి ప్రస్తుత వింజమూరు కార్యదర్శి శివకుమార్‌పై క్రిమినల్ కేసు నమోదుకు రంగం సిద్ధం అవుతోంది. నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇటీవల ఆయన్ను విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాజాగా శివకుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాల్సిందిగా కలెక్టరు ఆనంద్‌కు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. 2019 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబరు మధ్య కాలంలో శివకుమార్ కోవూరు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. ఆయన పని చేస్తున్న కాలంలో రూ.1,15,95,388 మేర అవినీతికి పాల్పడినట్లు అధికారులు లెక్క తేల్చారు. శివకుమార్‌తోపాటు ఇందుకు బాధ్యులుగా అప్పటి సర్పంచు, డీఆర్వో, డీఎల్‌పీఓ, ఆడిటింగ్ అధికారులపైనా క్రిమినల్ కేసు నమోదుకు అధికారిని నియమించాల్సిందిగా కలెక్టరుకు ఆదేశాలు అందడం సంచలనాత్మకంగా మారింది.

● వెలుగు చూసిందిలా..



కార్యదర్శి శివకుమార్

స్థాని మేజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి తమ క్వార్టర్స్‌కు ఇంటి పన్ను రూ.37,148 పంచాయతీకి చెల్లించారు. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ నుంచి రశీదు కూడా పొందారు. ఇంతలో బదిలీపై శివకుమార్ వింజమూరుకు వెళ్లారు. ఇంటి పన్ను చెల్లించాలని కోరుతూ ప్రస్తుత కార్యదర్శి శ్రీనివాసులు న్యాయాధికారికి డిమాండు నోటీసులు ఇచ్చారు. తాము ఇంటి పన్ను చెల్లించినా డిమాండు నోటీసులు ఇచ్చారంటూ న్యాయాధికారి కలెక్టరుకు తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన కలెక్టరు సమగ్ర దర్యాప్తునకు ఆదేశించారు. పంచాయతీ కార్మికులకు చెల్లించాల్సిన రూ.6లక్షలను కూడా పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తమ సొంత ఖాతాలో వేసుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చారు. ఈ విషయమై ఓ ఈఓపీఆర్డీ రహస్యంగా నివేదిక తయారుచేసి కలెక్టరుకు అందించినట్లు తెలిసింది. పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోమని కలెక్టరు రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్‌కు ప్రతిపాదన పంపారు. ఇలా పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగం వెలుగు చూసింది. భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడినా పట్టించుకోని జిల్లా పంచాయతీ అధికారి, డీఎల్‌పీఓ, ఈఓపీఆర్డీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశాలు అందాయి. చెక్కులపై సంతకాలు పెట్టిన అప్పటి సర్పంచు, స్పెషల్ ఆఫీసర్లపై కూడా కేసులు నమోదు చేయమని పంచాయతీ రాజ్ కమిషనర్ సంచలనాత్మక ఉత్తర్వులు జారీ చేశారు.

కరెంటు బిల్లుల చెల్లింపు

మరింత సులభం

క్యూఆర్ కోడ్ ద్వారా సంస్థకు జమ

బిల్లులోనే ముద్రించిన విద్యుత్ శాఖ



మనుబోలు, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లుల చెల్లింపుల్లో వినియోగదారులకు ఆ సంస్థ మరింత సౌలభ్యాన్ని తీసుకువచ్చింది. ఈ నెల నుంచే బిల్లులో క్యూఆర్ కోడ్ ముద్రించి అమలులోకి తెచ్చింది. కొన్నేళ్ళ క్రితం విద్యుత్ శాఖ సిబ్బంది బిల్లులు ఇళ్ళకు వచ్చి కట్టించుకునేవారు. ఆ తరువాత పెద్ద బుక్కులు తీసుకువచ్చి ఒకచోట కూర్చొని రాతపూర్వకంగా బిల్లులు కట్టించుకుని, చిన్న స్లిప్‌లు ఇచ్చేవారు. కొన్నాళ్లకు మిషన్ల ద్వారా బిల్లులు జారీచేసి, ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి కట్టించుకునేవారు. కొద్దికాలంలోనే ఫోన్‌పే, గూగుల్‌పే, యూపీఐ తదితరాల ద్వారా చెల్లింపులు ప్రారంభించారు. కొద్ది నెలలు కాగానే ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లింపులు వద్దని విద్యుత్ సంస్థ వాటిద్వారా చెల్లింపులను నిలిపివేసింది. తరువాత ఆన్‌లైన్‌లో సంస్థ వెబ్‌సైట్‌లో బిల్లులు చెల్లించాలని ప్రారంభించింది. తాజాగా క్యూఆర్‌కోడ్‌ను తీసుకువచ్చి చెల్లింపు ప్రక్రియ ప్రారంభించింది. మే నెలలో జారీ చేస్తున్న బిల్లుల్లోనే క్యూఆర్‌కోడ్ రూపొందించి వినియోగదారులకు అందజేస్తోంది. క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎంల ద్వారా బిల్లు చెల్లించవచ్చు.

● ఈ సర్వీసులకు మాత్రమే

జిల్లాలోని నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, కోవూరు డివిజన్ల పరిధిలో 9.61 లక్షల విద్యుత్ సర్వీసులు ఉన్నాయి. ఇందులో గృహ కనెక్షన్లు 7.8 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 1.45లక్షలు, పరిశ్రమలు 3,204, ప్రభుత్వ కార్యాలయాలు, వీధిదీపాలు, వాణిజ్యం, ఇతరత్రా కనెక్షన్లు 84 వేల వరకు ఉన్నాయి. ఇవిగాక ఆలయాలు, బడులు, ఇతరత్రా ప్రభుత్వానికి సంబంధించిన వాటర్ సర్వీసులు 19,278 వరకు సర్వీసులు ఉన్నాయి. ఈ నూతన విధానం ప్రభుత్వ సర్వీసులకు వర్తించదు. అలాగే అరియర్స్, బిల్లు పెండింగ్‌లో ఉన్న వినియోగదారులకూ ఈ వెసులుబాటు ఉండదని అధికారులు చెబుతున్నారు.

త్వరలో ప్రభుత్వ సర్వీసులకూ..



వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత చేరువ చేసేందుకే ఈ క్యూఆర్ కోడ్ విధానాన్ని అమల్లోకి తెచ్చాం. ప్రభుత్వ సర్వీసులకు, మరికొన్ని సర్వీసులకు తప్ప మిగతా సర్వీసులకు ఈ ప్రక్రియ అందుబాటులో ఉంటుంది. కొన్ని నెలల తరువాత ప్రభుత్వ సర్వీసులకు కూడా ఈ విధానాన్ని తీసుకువస్తాం. క్యూఆర్‌కోడ్ ద్వారా బిల్లులు ఎలా చెల్లించాలో వీడియోల ద్వారా ప్రచారం చేస్తున్నాం.

\- వి. విజయన్, ఎస్ఈ, విద్యుత్ శాఖ



దేవేరులతో కలిసి పల్లకీలో పెంచలకోన నుంచి గోనుపల్లికి బయలుదేరిన పెంచలస్వామి

అత్తారింటికి పెంచలోరు!

ఆరు రోజులపాటు భక్తజనుల నడుమ బ్రహ్మోత్సవాలను జరుపుకున్న లక్ష్మీనృసింహుడు బుధవారం తన అత్తారిల్లు అయిన గోనుపల్లి గిరిజన కాలనీకి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా కాలనీలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.

8

నెల్లూరు రూరల్ తహసీల్దారు సస్పెన్షన్

నెల్లూరురూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ తహసీల్దారు లాజరస్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఓ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అందిన సమాచారం మేరకు పీజీఆర్ఎస్‌లో ఉన్నతాధికారులకు అందించాల్సిన సమాచారం లోపభూయిష్టంగా ఉండటం, తప్పుడు నివేదికలు అందచేయడం వంటి ఫిర్యాదులు కలెక్టర్‌కు చేరాయి. వీటిపై సమగ్రంగా విచారణ చేపట్టిన కలెక్టర్ అవన్నీ వాస్తవాలని తేలడంతో తహసీల్దారును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇందులో ఓ డిప్యూటీ తహసీల్దారు పాత్ర కూడా ఉన్నట్లు తెలుస్తుండగా ఎలాంటి చర్యలు తీసుకున్నారనేది తెలియాల్సి ఉంది. కాగ కనుపర్తిపాడు భూ వ్యవహారంలో జిల్లా రెండవ ఉన్నతాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేశారన్న ఆరోపణలు తాజా ఘటనలో ప్రధాన అంశంగా తెలుస్తోంది.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

విడవలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం పంచాయతీ కొత్తూరులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి బుధవారం ప్రారంభించారు. వరిణి చెరువు బిట్-1 నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల రవిచంద్ర ఉచితంగా నీరు సరఫరా చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హరిరెడ్డి, శేషయ్య, శ్రీహరికోట గోపి, చిన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9069
వెండి కిలో ధర	రూ. 98,600
వెండి ఒక గ్రాము	రూ. 102.60

రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ'

● డీ సుజాత, ఏడీ, వ్యవసాయశాఖ, కోవూరు

కోవూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : కోవూరు సబ్ డివిజన్ పరిధిలోని 33,800 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపచేసేందుకు ప్రయత్నిస్తున్నాం. రైతులు ఈనెల 20వ తేదీలోగా రైతుసేవా కేంద్రాల్లో వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి జాబితాలో పేర్లు సరి చూసుకోవాలని కోవూరు సబ్ డివిజన్ ఏడీఏ డీ సుజాత తెలిపారు.

? అన్నదాత సుఖీభవ పథకంతో ఉపయోగం ఏమిటి.



! ఈ పథకానికి ఎంపికైన ప్రతి రైతుకు ఏడాదికి పెట్టుబడి ఖర్చుల కింది రాష్ట్ర ప్రభుత్వం రూ.14,000, కేంద్ర ప్రభుత్వం రూ.6,000తో కలిపి మొత్తం రూ.20,000 రైతు బ్యాంకు ఖాతాలో జమచేస్తోంది.

? అన్నదాత సుఖీభవ పథకం ఎంతమంది రైతులకు వర్తిస్తుంది.

! వ్యవసాయశాఖ కోవూరు సబ్ డివిజన్ పరిధిలో కోవూరు 4,137, కొడవలూరు 6,951, విడవలూరు 7,465, బుచ్చి 7,874, సంగం 7,373 మంది రైతులు ఉన్నారు. ఈ జాబితాను పరిశీలించి సబ్‌డివిజన్ పరిధిలోని రైతులందరికీ ఆర్థిక సహాయం అందేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం.

? రైతులందరూ అర్హులేనా. దరఖాస్తు ఎలా చేసుకోవాలి

! వ్యవసాయ, ఉద్యానవన, సెరి కల్చర్ సాగుచేసే రైతులు ఈ పథకానికి అర్హులు. , సరగుడు, జామాయిల్, ఎర్రచందనం చెట్ల పెంపకం చేసే రైతులు అనర్హులు. గ్రామస్థాయి నుంచి వ్యవసాయశాఖ సిబ్బంది రైతుల జాబితా తయారు చేస్తున్నారు. ఆ జాబితాలో పేరు లేని రైతులు రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే ఆర్బీజీఎస్ పోర్టల్‌లో ఈకేవైసీ నమోదు చేస్తారు. రైతు ఆధార్‌తో ఈ పథకాన్ని అనుసంధానిస్తాం.

? ఎప్పటిలోగా పేర్లు నమోదు చేసుకోవాలి.

! అన్నదాత సుఖీభవ పథకం పొందాలంటే రైతులు ఈనెల 20వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలి. అన్నదాత సుఖీభవ పోర్టల్ ఆన్‌లైన్‌లో కూడా ఈ పథకాన్ని దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎడగారు వరినాట్లు ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, మే 14(ఆంధ్రజ్యోతి): కనిగిరి రిజర్వాయర్ ఆయకట్టు కింద ఎడగారు వరినాట్లు ప్రారంభమయ్యాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలంతో పాటు కోవూరు నియోజకవర్గంలో సుమారు 60 నుంచి 65 వేల ఎకరాల్లో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అందులో బుచ్చి మండలంలో సుమారు 9నుంచి 10వేలు ఎకరాలు సాగు చేయనున్నారు. నారుమళ్ల కోసం అధికారులు సాగునీరు విడుదల చేసినప్పటి నుంచి ఇప్పటికే దాదాపు 20వేల ఎకరాల్లో వరినాట్లుకు సరిపడా రైతులు నార్లు పోశారు. మే నెలాఖరులోపు పూర్తి స్థాయిలో రెండో పంటకు నార్లు పోయనున్నారు. 20 రోజులకు ముందే బోర్లుకింద పోసిన నారుమడులు ఏతకు రావడంతో రెండు రోజులుగా వరినాట్లు వేస్తున్నారు. దీంతో దుక్కులు జోరుగా సాగుతున్నాయి.



కాళయకాగొల్లు వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

కూలీలు పెరిగాయి

వరినాట్లు వేసేందుకు కూలీలు, మందులకు ఎకరాకు సుమారు రూ.15వేలు ఖర్చవుతుంది. అందులో నారు పెరికి నాట్లు వేసేందుకే రూ.6వేలు, దుక్కులకు రూ.4నుంచి రూ.5వేలు, ఇతర పనులకు రూ.1500, ఖర్చు అవుతోంది. దీంతో పెట్టుబడులు బాగా పెరిగాయి.

- కాటంరెడ్డి శశిధర్‌రెడ్డి

ఈ నెల రోజులే పనులు



ఏడాదిలో రెండు నెలలు వరినాట్లు వేసే సమయాల్లోనే కూలి పనులు దొరుకుతాయి. ఆ తరువాత పనులే వుండవు. దీంతో కూలీ పనులు లేక కుటుంబాలు గడవడమే కష్టతరమవుతోంది.

- రాజమ్మ, వ్యవసాయ కూలీ

కూలి పనులకు వెళితేనే కుటుంబాలు గడవాలి



కూలి పనులకు వెళితేనే కుటుంబాలు గడవాలి. వ్యవసాయంలో ఎడగారు పైర్లు అంతగా లేవు. కనీసం పత్తి పంటలు సాగు చేస్తే అప్పుడు పనులు దొరుకుతాయి.

- సుప్రజమ్మ, వ్యవసాయ కూలీ

స్వయం శక్తి సంఘాల మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

● కలెక్టర్ ఆనంద్

ఇందుకూరుపేట, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని స్వయం శక్తి సంఘాల మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అరటినార ఉత్పత్తుల తయారీ శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలందరూ స్వయంగా ఆదాయం పొంది కుటుంబాలను అభివృద్ధి చేసుకోవడమే ప్రధాన ఉద్దేశంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. అరటి నారతో తయారైన అన్ని వస్తువులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించి ఆదాయాన్ని చూపిస్తామన్నారు. ప్రతి మహిళా ఆసక్తిగా నైపుణ్యంతో శిక్షణ పూర్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామన్నారు. వ్యర్థాల నుంచి సంపద సృష్టించాలనే ముఖ్యమంత్రి ఆలోచన మేరకు రీసైక్లింగ్ యాక్టివీస్ ముందుకు తీసుకెళ్లేందుకు అరటినారతో వస్తువులు తయారు చేసేందుకు మహిళలకు స్కిల్ ఇండియా మిషన్ సహకారంతో శిక్షణ ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 30మంది మహిళలను ఒక యూనిట్‌గా చేసి 30 రోజులపాటు శ్రీకాకుళం నుంచి ప్రత్యేకంగా విచ్చేసిన అప్పమ్మ ద్వారా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరు పారిశ్రామిక వేత్తగా తయారయ్యేందుకు సీఎం పిలుపుమేరకు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అరటినార ఉత్పత్తులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, తహసీల్దారు కృష్ణప్రసాద్, ఏపీఎం సరిత, ఏసీ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



అరటి నారతో తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆనంద్

వైభవంగా కోదండరాముడికి కుంభాభిషేకం

బుచ్చిరెడ్డిపాళెం, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీపురంధరపురంలో నూతనంగా నిర్మించిన సీతారామ లక్ష్మణ హనుమత్ సేమత కోదండరామస్వామి ఆలయంలో బుధవారం మహా కుంభాభిషేకము వైభవంగా జరిగింది. పండితుల వేదమంత్రోచ్చరణలతో శ్రీపురంధరపురంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈనెల 11 నుంచి గ్రామంలో జరుగుతున్న సీతారామ లక్ష్మణ హనుమత్ సేమత కోదండ రామస్వామి నూతన శిలాబింబ జీవధ్వజ విమాన రాజగోపుర త్రయాహ్నిక ప్రతిష్ఠా పూజా కార్యక్రమాల్లో భాగంగా జరిగిన మహా కుంభాభిషేక మహోత్సవంలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. స్వామి, అమ్మవారికి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రత్నన్యాసం, యంత్ర స్థాపన చేశారు. తరువాత విమాన కలశ ప్రతిష్ఠ, బింబ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి నిర్వహించారు. స్వామివారికి గోదర్శనం, ముఖ దర్శనం, హారతి ఇచ్చారు. పూజల్లో ఆలయ ధర్మకర్త రాము, మణితోపాటు తదితరులు పాల్గొన్నారు. భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదములు స్వీకరించారు.

జూన్ 16కల్లా రీసర్వే పూర్తికావాలి : జేసీ



రీసర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

మనుబోలు, మే 14(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 16కల్లా మనుబోలులో రీసర్వే పూర్తిచేయాలని రెవెన్యూ సిబ్బందిని జేసీ కే. కార్తీక్ ఆదేశించారు. మనుబోలు రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ రీసర్వే ప్రాంతంలోని సర్వేయర్లు, రైతులతో మాట్లాడారు. రీసర్వే సక్రమంగా జరుగుతుందా.. ఏమైనా సమస్యలున్నాయా ..? అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ మనుబోలు రెవెన్యూలో 4950 ఎకరాల్లో రీసర్వే చేయాల్సి ఉందన్నారు. ఇందుకుగాను 10బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.. రీసర్వేకోసం 10మంది వీఆర్‌వోలు,20మంది విలేజ్ సర్వేయర్లు పనిచేస్తున్నారని తెలిపారు. రైతులు రీసర్వే సిబ్బందికి సహకరించాలన్నారు. ఎక్కడైతే రీసర్వే జరుగుతుందో ఆ రైతుకు ముందస్తుగా సమాచారం ఇస్తున్నామని వివరించారు. ఇంకా ఎవరైనా రైతులు డాక్యుమెంట్లు ఇవ్వకపోతే వెంటనే వీఆర్‌వోలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ రఘురామరాజు, తహసీల్దార్ సీహెచ్. సుబ్బయ్య, వీఆర్‌వోలు, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

దళితకాలనీలో విద్యుత్ సమస్యకు పరిష్కారం

కొడవలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరు దళిత కాలనీలోని విద్యుత్తు స్తంభాలు ఇటీవల దెబ్బతిన్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో సమస్యను బుధవారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దృష్టికి దళితకాలనీ నాయకులు కోవూరు వెంకీ, కాకాని మురళీకృష్ణ, దాసరి పవన్‌కుమార్, నక్కా రమణయ్య, పాముల చెన్నయ్య, పొన్నూరు మస్తాన్ తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్తు శాఖాధికారులు హుటాహుటిన విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరాకు ఆటంకం లేకుండా చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మండల ఇన్‌చార్జి ముంగమూరు శ్రీహరిరెడ్డిలకు దళిత కాలనీవాసులు, నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

నేత్రదానం

విడవలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): విడవ లూరు పంచాయతీకి చెందిన ఇన్నమాల బుజ్జమ్మ (90) బుధవారం మృతి చెందారు. మన సేవా సంస్థ నిర్వాహకులు దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మృతురాలి నేత్రాలను కుటుంబసభ్యులు నెల్లూరు ప్రభుత్వ అసుపత్రికి దానం చేశారు. నేత్రాలను టెక్నీషియన్ సునీల్ సేకరించారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే ప్రమాదాలు

వెంకటాచలం, మే 14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించి వాహనాలు నడిపితే, ప్రమాదాలు జరుగుతాయని నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఎస్‌ఐ ఎం. హరికృష్ణ తెలిపారు. మండలంలోని సరస్వతీనగర్ వద్ద ఉన్న అక్షర విద్యాలయంలో జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరంలో బుధవారం ట్రాఫిక్ రూల్స్, అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు యోగాసనాలు వేశారు. అనంతరం ఎస్‌ఐ హరికృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కచ్చితంగా ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తే అంతా సురక్షితంగా ఉంటామన్నారు. వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీటు బెల్ట్ ధరించకుండా కార్లు నడపరాదని, ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను అగ్నిమాపక అధికారి వేణుగోపాల్‌రావు, ఫైరింగ్ ఆఫీసర్ టీ.కిరణ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో మేజర్ రాజేష్‌కుమార్, హేమంత్‌కుమార్, ఎన్‌సీసీ అధికారులు బాలబ్రహ్మాచారి, మస్తాన్‌వలి, పెంచలపుల్లయ్య, దీప్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో చివరి ఆయకట్టుకు సాగునీరు

విడవలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి చొరవతో చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందజేస్తున్నామని ఈస్ట్రన్ చానల్ డీసీ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి తెలిపారు. వరిణి చెరువు కిందనున్న 5వేల ఎకరాల ఆయకట్టుకి బుధవారం అయన నీటిని విడుదల చేశారు. అయన మాట్లాడుతూ ఖరిఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 20వేల ఎకరాల వరకు రైతులు పంటలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వరిణి బిట్-1 నీటి సంఘం అధ్యక్షుడు ఆవుల రవిచంద్ర, ఉపాధ్యక్షుడు చిన్ని వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు వెంకటరమణయ్య, మల్లికార్జున, రాజయ్య, వైస్ ఎంపీపీ ఆవుల శ్రీనివాసులు, నాయకులు మల్లి కిశోర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

నెల్లూరు(క్రైం), మే 14 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వివాహిత మృతి చెందింది. ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని రామలింగాపురంలో కిషన్‌కుమార్, పుష్పలతారెడ్డి (40) దంపతులు నివసిస్తున్నారు. పుష్పలతరెడ్డి తన కుటుంబ స్నేహి తుడు కిరణ్‌కుమార్‌తో కలిసి మంగళవారం రాత్రి బైక్‌పై కోవూరు నుంచి నెల్లూరుకు జాతీయ రహదారి మీదుగా వస్తున్నారు. మూడోమైలు బ్రిడ్జిమీదకు వచ్చేసరికి ఆమె చున్నీ బైక్ చైన్‌లో ఇరుక్కోవడంతో బైక్ అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో పుష్పలతా రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. అపస్మా రకస్థితిలో ఉన్న ఆమెను స్థానికులు చికిత్స నిమి త్తం మెడికవర్ వైద్యశాలలో చేర్పించారు. పరీ క్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధా రించారు. పుష్పలత భర్త నార్త్ ట్రాఫిక్ పోలీసు లకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ బల రామిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బైక్‌పై ఉన్న కిరణ్‌కుమార్‌కు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ప్రధాని మోదీ వల్లే దెబ్బతింటున్న దేశ ప్రతిష్ట

● బిహార్‌లో ఎన్నికల కోసమే ఆపరేషన్ సిందూర్ ● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

నెల్లూరు (వైద్యం), మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ వల్లే దేశ ప్రతిష్ట దెబ్బతిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం నెల్లూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత సైనికులు వీరోచితంగా పోరాడుతున్న తరుణంలో పాకిస్థాన్ - ఇండియా యుద్ధంలో అమెరికా జోక్యాన్ని ఎందుకు సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. బీహార్‌లో త్వరలో ఎన్నికలు ఉన్నాయని ఇందులో ఎక్కువ అసెంబ్లీ సీట్లు కైవసం చేసుకోవ డానికే 'ఆపరేషన్ సిందూర్'ను ఉపయోగించుకోవాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఇక రాష్ట్రంలో స్మార్ట్‌మీటర్ల ఏర్పా టును ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తున్న దశలో కూటమి ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మొదట్లో దీనిని వ్యతిరేకించిన టీడీపీ ప్రభుత్వమే ఈ స్మార్ట్ మీటర్లను ఎలాగైన పెట్టాలని చూస్తుందని విమర్శించారు. గతంలో రూ.1700 కోట్ల ముడుపులు తీసుకున్న కేసులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై చర్యలేవని ఎద్దేవా చేశారు. అక్రమ ముడుపుల చెల్లింపులో వాస్తవాలు బయటపడ్డా ఇంతవరకు చర్యలు ఎం దుకు తీసుకోలేదని ప్రశ్నించారు. కమీషన్ల కోసమో అదానీ కోసమో స్మార్ట్ మీటర్లు బిగిస్తే పెద్ద ఎత్తున ప్రజల్లో వ్యతిరేక రావడం ఖాయమని వెల్లడించారు. ఈ సమావేశంలో సీపీఎం నేతలు మూలం రమేష్, అజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సాగరం స్టేషన్‌లో ప్రక్షాళన జరిగేనా..?

● నిత్యం పంచాయితీల బాగోతం ● తిష్టవేసిన సీనియర్లు

అనంతసాగరం మే 14 (ఆంధ్రజ్యోతి): స్థా నిక పోలీసుస్టేషన్‌లో సి బ్బంది పనితీరుపై విమ ర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదుదారుల పట్ల మర్యాద, కరుణ కరు వైందని, కొందరు సిబ్బం ది పంచాయితీల పేరిట అక్రమ వసూళ్లకు పాల్ప డుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్‌ఐతో సహా కొందరు సీనియర్ల బదిలీ కొంత కాలంగా జరగలే దు. గత ప్రభుత్వంలో ఉన్నవారే నేటికి కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత జిల్లా వ్యాప్తంగా బదిలీలు జరగ్గా, సాగరం పోలీసుస్టేషన్‌లో మాత్రం జరగలేదు. ఇక్కడ పనిచేసే సీనియర్లను చూసి ఫిర్యాదు దారులు హడలెత్తిపోతున్నారు. వైసీపీ నాయకులు చెప్పినట్లు సిబ్బంది పనులు చేస్తున్నారనే అపవాదు ఉంది.

● ప్రైవేటు కేసుల నమోదు

ఇటీవల రేవూరుకు చెందిన ఒక వ్యక్తిని కేసు విచారణలో భాగంగా విచక్షణ రహితంగా కొట్టి నట్లు సమాచారం. అతను ప్రైవేటు కేసు వేయ డంతో పాటు, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అనంతసాగరంలో ఒక రైతుకు చెందిన మూడు గేదెలను వెంగంపల్లి వద్ద కొందరు విషగుళికలు పెట్టి, రెండు నెలల క్రితం హతమార్చారు. ఈ విషయమై బాధిత రైతు ఫిర్యాదు చేయగా ఎవరూ పట్టిం చుకోలేదు. ఆ రైతు కూడా ప్రైవేటు కేసు వేశా డు. ఇటీవల గ్రావెల్ మాఫియాకి చెందిన రికా ర్డింగ్ వాయిస్ సోషల్ మీడియాలో తీవ్రచర్చకు దారితీసింది. అందులో పోలీసులకు ఇచ్చే మామూళ్ల వ్యవహారం కూడా బయట పడింది. ఇక స్టేషన్ బాస్ ఎక్కువ సమయం స్టేషన్‌లో ఉండరని, అత్యవసర సమయంలో ఫోన్ చేసినా స్పందించరని టీడీపీ నేతలు గుసగుసలాడుతున్నారు. ఈ క్రమంలో సిబ్బంది ప్రక్షాళన అవసరమని పలువురు అంటున్నారు.



అనంతసాగరం పోలీసుస్టేషన్ (ఫైల్)



ఉదయగిరిలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

కుట్టు శిక్షణ... ఆర్థిక స్వాంతన

● జిల్లాలో 4,967 మందికి తర్ఫీదు ఇవ్వడమే లక్ష్యం

● సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక ప్రగతి సాధించి కుటుంబానికి ఆసరాగా నిలవాలి. స్వయం ఉపాధితో ఆర్థిక స్వాలంబన సాధించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వారికి కుట్టు శిక్షణ ఇస్తున్నది. ఇది మహిళల స్వయం ఉపాధికి ఊతంగా నిలువనున్నది.

● 4,967 మందికి శిక్షణ లక్ష్యం

జిల్లాలో 44 కేంద్రాల ద్వారా 4,967 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 14 కేంద్రాల ద్వారా 2,400 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఆయా కేంద్రాల్లో మహిళలకు ట్రైనర్ ద్వారా 90 రోజులపాటు శిక్షణ ఇస్తారు. అవకతకలు జరగకుండా ఫేషియల్ యాప్ ద్వారా హాజరు పద్ధతిని ప్రవేశపెట్టారు. దీంతో ప్రతిఒక్కరూ కేంద్రానికి వచ్చిన సమయంలో, వెళ్లే సమయంలో ముఖహాజరు వేయాల్సి ఉంది. 75 శాతానికి హాజరు తగ్గకుండా ఉంటేనే మిషన్ ఇస్తామనే నిబంధన పెట్టారు. దీంతో మహిళలు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాల్సి ఉంది. కుట్టుమిషన్‌తో వచ్చే ఆదాయంతో కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయం. ఉదయగిరిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో 130 మంది శిక్షణ పొందుతున్నారు.

కుటుంబానికి ఆసరాగా...



ప్రభుత్వం కుట్టు శిక్షణ ఇస్తుండడంతో మహిళలకు భరోసా దక్కుతోంది. చదువులు పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉన్న యువతులకు ఇది ఎంతో ఉపయోకరంగా ఉంది. ఇంటిలో ఖాళీగా ఉండకుండా స్వయం ఉపాధి పొందవచ్చు. తద్వారా కుటుంబానికి ఆసరాగా ఉండవచ్చు.

- షేక్ నాజియ

సొంతకాళ్లపై నిలబడాలని...



సొంత కాళ్లపై నిలబడాలనే తపనతో శిక్షణకు వస్తున్నా. ప్రభుత్వం మహిళలకు చక్కటి అవకాశం కల్పించింది. ఉచితంగా శిక్షణతోపాటు కుట్టుమిషన్ ఇవ్వడం సంతోషం. శిక్షణ అనంతరం ఇంటి వద్దనే ఉంటూ నాలుగు రూపాయలు సంపాదించే అవకాశం ఉంది.

- పాదిలి అన్నపూర్ణ

పేదలకు వరం



ప్రభుత్వం పెట్టిన ఈ శిక్షణ కేంద్రం మాలాంటి పేదలకు వరం. టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నా. కుట్టులో శిక్షణ తీసుకుంటే కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనే ఆశ.

- షేక్ షాహిన

2,400 మందికి శిక్షణ ఇస్తున్నాం

జిల్లాలో 44 కేంద్రాల ద్వారా 4,967 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడమే లక్ష్యం. ఇప్పటివరకు 14 కేంద్రాల ద్వారా 2,400 మందికి శిక్షణ ఇస్తున్నాం. త్వరలో లక్ష్యాన్ని అధిగమిస్తాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నిర్మలాదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

21 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మర్రిపాడు మండలం కేతిగుంట, దుత్తలూరు మండలం నందిపాడు గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలపై నెల్లూరు స్క్వాడ్ అధికారులు, స్థానిక ఎక్సైజ్ పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ దీప్తికరంత్ బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో 21 మద్యం సీసాలతోపాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు.

జనసేనలో భగ్గుమన్న విభేదాలు : ఒకరిపై దాడి

సంగం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గ జనసేనలో కొంతకాలంగా నెలకొన్న వర్గవిభేదాలు మంగళవారం రాత్రి భగ్గుమన్నాయి. ఒక వర్గ నాయకుడిపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును, వేరే గ్రూపుల్లో పోస్టు చేశారని దాడి చేశారు. సేకరించిన వివరాల మేరకు, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ వర్గాలుగా ఆత్మకూరులో జనసేన నాయకులు, కార్యకర్తలు విడివిడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టిడ్కో చైర్మన్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును నలిశెట్టి శ్రీధర్ వర్గానికి చెందిన సంగం మండలం తరుణవాయికి చెందిన మావిళ్ల ఆనంద్ ఇతర గ్రూపుల్లో పోస్టు చేశాడు. దీంతో టిడ్కో చైర్మన్ అనుచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ బుధవారం ఉదయం స్టేషన్‌కు రావాలని ఆనంద్‌ను పిలిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి టిడ్కో చైర్మన్ అనుచరులు కారు, నాలుగు మోటారు బైక్‌లపై సుమారు 15 మంది వెళ్లి, తరుణవాయిలోని ఆనందను బయటకు పిలిచి దాడి చేశారు. దాడిలో గాయపడిన ఆనంద్ వైద్య చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడి సిబ్బంది సూచన మేరకు 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడ ఆయన చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

వెంకటాచలం, మే 14 (ఆంధ్రజ్యోతి): తనకు ఓ వ్యక్తి లైంగికంగా వేధిస్తున్నాడని, సోషల్ మీడియాలో ఫొటోలు పోస్టు చేస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని బాధిత వివాహిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని అనికేపల్లికి చెందిన ఓ వివాహిత(27)ను, అదే గ్రామానికి చెందిన బోచు బాబీ లైంగికంగా వేధిస్తున్నాడు. అంతటితో ఆగక బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు నిద్రమాత్రలు ఇచ్చి కోరిక తీర్చుకుంటానని బెదిరించినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మే 14 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద ఈ నెల 10వ తేదీ గుర్తుతెలియని 30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిఉండటాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250
కోడిగుడ్ల ధర (100):	500



సంప్రదాయ ఆటలపై అవగాహన

నెల్లూరు (సాంస్కృతికం), మే 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం బాలబాలికలకు సంప్రదాయ ఇండోర్ గేమ్స్‌పై అవగాహన కల్పించారు. చెస్, కార్యమ్స్, వామనగుంట తదితర ఆటల గురించి వివరించి వాటిని ఆడే విధానాన్ని నేర్పించారు. అలాగే పుస్తక పఠనం, యోగా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాసైన్స్ వేదిక నగర అధ్యక్షుడు ఎం సతీష్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ ప్రసాద్ పర్యవేక్షించారు.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

భగత్‌సింగ్‌కాలనీ వాసులకు

పట్టాలు సిద్ధం

- త్వరలో సీఎం చేతుల మీదుగా ఇస్తాం
- నెల్లూరు అర్బన్ తహసీల్దారు షఫీమాలిక్

నెల్లూరు(వెంకటేశ్వరపురం), మే 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని భగత్ సింగ్ కాలనీలో నివసిస్తున్న వారికి ఇచ్చేందుకు ఇళ్ల పట్టాలు సిద్ధం చేస్తున్నట్లు నెల్లూరు నగర తహసీల్దారు షఫీమాలిక్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం నూతన రేషన్‌కార్డులు మంజూరు చేసేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఆయన బుధవారం ఆంధ్రజ్యోతికి పలు వివరాలు వెల్లడించారు.

? నూతన రేషన్‌కార్డులకు ఎప్పటిలోగా దరఖాస్తు చేసుకోవాలి.

! నూతన రేషన్‌కార్డులతోపాటు ఇప్పటికే ఉన్న రేషన్‌కార్డుల్లో మార్పుల కోసం అంటే కార్డుని విడగొట్టడం, పేర్ల తొలగింపు, జత చేయడం వంటి వాటి కోసం జూన్ 6 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

? భగత్‌సింగ్‌కాలనీ వాసులకు పట్టాలు ఎప్పుడిస్తారు.


! భగత్‌సింగ్‌కాలనీ మొత్తం 36 ఎకరాల భూమిని ఇరిగేషన్ నుంచి రెవెన్యూకి మార్పుచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే జీవో విడుదల చేసింది. మొత్తం 1400 మందికి పట్టాలు సిద్ధం చేస్తున్నాము. వీటిలో 1100 నివాసాలు ఉండగా, 300 ఖాళీ స్థలాలు ఉన్నాయి. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా పట్టాలు అందజేస్తాము.

? ఎంఎస్ఎంఈ పార్క్ కోసం ఎంత భూమిని కేటాయించారు.

! నగర పరిధిలోని భగత్‌సింగ్‌కాలనీ వద్ద ప్రభుత్వ భూమి 2.4 ఎకరాలను ఏపీఐఐసీకి అప్పగించాము. అందులో ఎంఎస్ఎంఈలో భాగంగా ఎఫ్ఎఫ్‌సీ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్) నిర్మాణం చేపడుతున్నారు.

మేతల మేనేజర్

- జీజీహెచ్ పారిశుధ్య విభాగంలో గందరగోళం
- ఇష్టారాజ్యంగా వ్యవహరించిన మేనేజర్
- కార్మికుల వేతనాల్లో కోత.. అరకొరగా చెల్లింపు
- మిగిలిన నిధులు స్వాహా!
- ఒకేసారి 30 మంది తొలగింపుతో ఆందోళన
- మేనేజర్‌నే తప్పించిన ఏజిల్ సంస్థ



నెల్లూరు (వైద్యం), మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పారిశుధ్య విభాగంలో గందరగోళం నెలకొంది. కొందరు పారిశుధ్య కార్మికుల నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేసినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణను ప్రభుత్వం ఏజిల్ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థకు అప్పగించింది. ఇందుకోసం ఆ సంస్థకు నెలకు రూ. 48 లక్షలు చెల్లిస్తోంది. నిబంధనల ప్రకారం 145 మంది పారిశుధ్య సిబ్బంది పనిచేయాల్సి ఉంది. అయితే పని ఒత్తిడి కారణంగా 175 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిపై సూపర్వైజర్లను కూడా నియమించారు. ఒక్కో పారిశుధ్య కార్మికునికి రూ. 16 వేలు జీతంకాగా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి మినహాయింపులుపోను రూ.13వేల వరకు చెల్లించాల్సి ఉంది.

అయితే సదరు ఏజిల్ సంస్థ మేనేజర్‌గా ఉన్న కొండయ్య వీరికి సక్రమంగా జీతాలు చెల్లించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు కార్మికులు విధుల్లో లేక పోయినా వారి పేరు మీద మేనేజర్ వేతన నగదు స్వాహా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. కార్మికుల హాజరు సక్రమంగా చూపకుండా జీతాల్లో కోత విధించి కొందరికి రూ.5 వేలు, రూ.7 వేలు మాత్రమే చెల్లిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

పారిశుధ్య కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తాను. ఏజిల్ సంస్థకు పారిశుధ్య బాధ్యతలు అప్పగించాం. అయితే మేనేజర్ అక్రమాలకు పాల్పడినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.



- డాక్టర్ నరేంద్ర, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, జీజీహెచ్

● పీఎఫ్ డబ్బులు ఏమయ్యాయి?

జీజీహెచ్‌లోని ఏడుగురు పారిశుధ్య సిబ్బంది నుంచి పీఎఫ్ చెల్లింపుల పేరిట రూ.96 వేలను మేనేజర్ వసూలు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ నగదు తిరిగి చెల్లించాలని సదరు కార్మికులు వేడుకుంటున్నారు. అంతేకాదు, ఓ మహిళా కార్మికురాలు బ్యాంకు రుణం పొందడం కోసం ఆమెకు రూ.30 వేలు వేతనం చెల్లిస్తున్నట్లు మేనేజర్ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిసింది. ఇందుకుగాను ఆ కార్మికురాలి నుంచి రూ.30 వేలు తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

● 30 మంది కార్మికుల తొలగింపు

ఈ నెల 10వ తేదీన ఏకంగా 20 మంది పారిశుధ్య కార్మికులు, 10 మంది పారిశుధ్య సూపర్వైజర్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు సదరు మేనేజర్ తెలియచేశారు. కొత్తగా కొందరిని పనిలోకి తీసుకుని వారి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఆందోళనకు దిగింది. ఏకంగా ఏజిల్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకుడు సిద్ధార్థకు ఫిర్యాదు చేసింది. పూర్తి వివరాలు తెలుసుకున్న ఆయన మేనేజర్‌నే విధుల నుంచి తొలగించారు. కార్మికులను తొలగించిన విషయం తనకు తెలియదని, వారిని తిరిగి విధుల్లో తీసుకుంటున్నట్లు సిద్ధార్థ తెలిపారని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ పేర్కొన్నారు.



దుకాణదారుడితో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

రోడ్డుపై ఆక్రమణలు స్వచ్ఛందంగా తీసేయండి

- కబ్జాదారులకు కమిషనర్ ఆదేశం

నెల్లూరు(సిటీ), మే 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్ల వెంబడి ఆక్రమణలను కబ్జాదారులే స్వచ్ఛందంగా తొలగించాలని కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్ ఆదేశించారు. బుధవారం నగరంలోని 17వ డివిజన్‌లో రోడ్డు ఆక్రమణలను పరిశీలించారు. మంత్రి ఆదేశాలతో నగరంలో ఆక్రమణల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, స్వచ్ఛందంగా ఆక్రమణలను తీసేయాలని, లేకపోతే తామే తీసేయాల్సి వస్తుందని హెచ్చరించారు. నిర్మాణంలో ఉన్న ప్రతీ భవనం అనుమతులు పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రతీ అసెస్మెంట్ నుంచి పన్ను వసూలు చేయాలని స్పష్టం చేశారు. కాగా, ఎంహెచ్‌వో చైతన్య 38వ డివిజన్‌లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

ఆర్ఐ, అడ్మిన్‌కు షోకాజు నోటీసులు

నెల్లూరు(సిటీ), మే 14,(ఆంధ్రజ్యోతి) : కార్పొరేషన్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కార్తీక్‌రెడ్డి, 17వ డివిజన్ సచివాలయ అడ్మిన్ సతీష్‌కు బుధవారం నగర కమిషనర్ వైవో నందన్ షోకాజు నోటీసులు జారీ చేశారు. పన్ను వసూళ్లలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో కార్పొరేషన్‌కు రావాల్సిన ఆదాయం నష్టపరిచారంటూ ఈ నోటీసులిచ్చారు. 17వ డివిజన్ పరిధిలోని అపోలో ఆసుపత్రి వద్ద రెండు భవనాలకు పన్ను వసూలు చేయకపోవడం, చిల్డ్రన్స్ పార్కు సమీపంలోని ఖాళీ స్థలానికి పన్ను వేయకపోవడాన్ని నోటీసుల్లో ప్రస్తావించారు. ఈ నిర్లక్ష్య ధోరణిపై ఎందుకు చర్యలు తీసుకోకూడదో మూడు రోజుల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కమిషనర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఆర్వోలకు డివిజన్ల కేటాయింపు

నెల్లూరు(సిటీ), మే 14,(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థలో కొత్త రెవెన్యూ అధికారులకు డివిజన్లు కేటాయిస్తూ కమిషనర్ నందన్ బుధవారం ఉత్తర్వులిచ్చారు. ఎస్ఏ సమ్మద్‌కు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 18.22, 23,24,25,26,30,31,37,41 డివిజన్లు, సిటీ నియోజకవర్గంలోని 6,7,8,9,10,39,40 నుంచి 50 వరకు, 53,54 డివిజన్లు కేటాయించారు. మరో ఆర్వో శ్రీనివాసులుకు రూరల్లో 1,2,12,17,19,20,21,27,28,29,32,33,34,35,3,638 డివిజన్లు, సిటీలో 3,4,5, 11,13,14,15,16,51,52 డివిజన్లు అప్పగించారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన డాక్టర్ జడ్ఎస్

నెల్లూరు (వైద్యం), మే 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జెడ్ శివప్రసాద్ బుధవారం కలిశారు. అంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు ఛైర్మన్‌గా తనను ఎంపిక చేసిన నేపథ్యంలో కృతజ్ఞతలు తెలిపారు.

'అపోలో'లో ఐదేళ్ల బాలికకు అరుదైన శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం), మే 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని అపోలో ఆసుపత్రిలో ఐదేళ్ల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స జరిగింది. ఈ సందర్భంగా బుధవారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, న్యూరో సర్జన్ డాక్టర్ వెంకట్, యూనిట్ హెడ్ బాలరాజు మాట్లాడారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణానికి చెందిన సునంద(5)కు రోడ్డు ప్రమాదంలో తలకి గాయమైందన్నారు.



చిన్నారితో కలిసి మీడియా సమావేశంలో వైద్యులు

వెంటనే ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షించి కుడివైపు మెదడులో రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించామన్నారు. కీ హోల్ పద్ధతిలో మెదడులో గడ్డకట్టిన రక్తాన్ని తొలగించి చిన్నారికి మరో జన్మ ప్రసాదించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో చిన్నారితోపాటు వైద్య నిపుణులు పాల్గొన్నారు.

పొదలకూరురోడ్డులో 3 రోజులు విద్యుత్ కోత

నెల్లూరు (జడ్పీ), మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాలను మారుస్తుండటంతో గురు, శుక్ర, శనివారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. క్యాన్సర్ హాస్పిటల్, జడ్పీ కాలనీ, సారాయి అంగడి సెంటర్, పద్మావతి సెంటర్, నేతాజీ నగర్, గౌతమి నగర్, పొదలకూరురోడ్డు పరిసర ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలియజేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'రెయిన్‌బో' విజయం

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ పది, పన్నెండు తరగతి ఫైనల్ పరీక్షల్లో రెయిన్‌బో పాఠశాల అత్యుత్తమ ఫలితాలు సాధించిందని ఆ పాఠశాల డైరెక్టర్ పద్మా సుబ్రహ్మణ్యం తెలిపారు. విద్యాసంస్థలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పదో తరగతిలో ఎప్పటిలాగానే ఉత్తమ ఫలితాలు సొంతం చేసుకోగా, పన్నెండవ తరగతిలో తొలిబ్యాచే ప్రతిష్ఠాత్మక ఫలితాలు సాధించిందని పేర్కొన్నారు. ఇంటర్ ఎంపీసీ విభాగంలో 500 మార్కులకు పీ శ్రీతన్వి 468, ఎస్ హరిబాబు 467, ఎండీ బిల్లాల్ 466, దర్శనా పరమార్ 462, టీ శాన్వీరెడ్డి 455 మార్కులు సాధించారని చెప్పారు. టెన్త్‌లో 500 మార్కులకు శ్రేయ కుష్వాహ 491 మార్కులు, జంపాని షారన్ సారుష్య 488, తనూష కంచె 487, ఎం నయన్ మౌర్య, మొహ్మద్ యూనస్ 484 మార్కులు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అనీ గోపకుమార్, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఇంటర్ టాపర్ శ్రీతన్వి, టెన్త్ టాపర్ శ్రేయ కేష్వాహకు అభినందన

18న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 18న గొలగమూడిలోని ఫన్ పార్కు కన్వెన్షన్ హాలులో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ వింగ్స్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఫన్ పార్కు ఎండీ పొత్తూరి సాయి సహకారంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా అన్ని ర్యాంకుల క్రీడాకారులు, ఫిడే రేటింగ్ క్రీడాకారులు హాజరవుతున్నారని, వీరికి ఉచిత, భోజన, రవాణా సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. విజేతలకు రూ.లక్ష నగదు బహుమతులు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందచేస్తామన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.



గజ వాహనంపై కాశీవిశ్వనాథుడు

నెల్లూరు (సాంస్కృతికం), మే 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఉస్మాన్ సాహెబ్‌పేట అన్నపూర్ణ సమేత కాశీ విశ్వనాథ స్వామి బుధవారం రాత్రి గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం తీర్థవాది, త్రిశూల స్నానం, విశేష పూజలు జరిగాయి. రాత్రికి ధ్వజావరోహణం గావించారు. అనంతరం గజవాహనంపై పేట ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాలను ఆలయ ఈవో దర్గయ్య పర్యవేక్షించారు



డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు

ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లకు అభినందన

నెల్లూరు (జడ్పీ), మే 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన అయూబ్ ఖాన్, గురవయ్యను జిల్లా విద్యుత్ ఏపీ ఈఈఎంఎంఏ అసోసియేషన్ నాయకులు ఎస్ఎం బాషా, అల్తాఫ్ అభినం దించారు. వారు బుధవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి డైరెక్టర్లకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నవాబుజానీ, రియాజ్, దిల్దారు జాక్రియా తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో 'అవెన్యూస్' ప్రతిభ

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో అవెన్యూస్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారని ఆ స్కూలు కరస్పాండెంట్ కృష్ణచైతన్య తెలిపారు. పాఠశాలలో బుధవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ పాఠశాలకు చెందిన లక్ష్మీ విజ్వల్ 485, పెంచల సాయిపవన్ 480, సయ్యద్ రిహాన్ 476 మార్కులు సాధించారన్నారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులందరూ ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్వేత సంధ్య, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

చంపుతామని బెదిరించి దోచుకెళ్లారు!

నెల్లూరు(క్రైం), మే 14 (ఆంధ్రజ్యోతి) : రైలుదిగి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు చంపుతామని బెదిరించి నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన బుధవారం నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సంగం మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన వీరరాఘవయ్య పది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున రైలులో నెల్లూరుకు చేరుకున్నారు. రైలుదిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైక్‌లలో వచ్చి వీరరాఘవయ్యను అడ్డుకున్నారు. కత్తితో చంపుతామని బెదిరించి అతని వద్ద నుంచి రూ.1000 నగదు దోచుకెళ్లారు. బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విరువూరులో అక్రమ లేఅవుట్ల పరిశీలన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరులో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన లేఅవుట్లను బుధవారం నుడా అధికారులు పరిశీలించారు. గ్రామ సర్వే నంబరు 548లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యాపారులు లేఅవుట్లు వేసి వ్యాపారాలు సాగిస్తున్నారనే ఫిర్యాదు అందింది. దీంతో సర్వే అధికారులు వినయ్‌కుమార్, హరిశంకర్ అక్కడికి చేరుకొని సర్వే చేశారు. తమ శాఖతో సహా పంచాయతీ అనుమతులు లేకపోవడంతోపాటు కన్వర్షన్ చేయించలేదని నిర్ధారించారు. కనీసం రహదారుల నిర్మాణం కూడా చేపట్టలేదని గుర్తించారు. సమీపంలోని వంక పోరంబోకు, బండ్లబాటను సైతం ఆక్రమించుకున్నారని పలువురు గ్రామస్థులు వారికి విన్నవించారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్‌బేగం, సర్వేయర్ కొండయ్య పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయ

హుండీ ఆదాయం రూ.24.60 లక్షలు

నెల్లూరు (సాంస్కృతికం), మే 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు జరిగింది. ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి బుధవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించారు. సాధారణ హుండీల ద్వారా రూ. 24,60,963, అన్నదాన హుండీ ద్వారా రూ.76,088 లభించింది. ఇవికాక యూఎస్ డాలర్ ఒకటి, సౌదీ రియాన్‌లు 5,100, సౌదీ రాయస్ ఒకటి వచ్చాయి. ఈ కార్యక్రమాన్ని దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్, ఆలయ ఈవో కోవూరు జనార్దన్‌రెడ్డి, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం సుధీర్, ఈవో శ్రీధర్‌నాయుడు, ప్రధాన అర్చకుడు రఘురామమూర్తి తదితరులు పర్యవేక్షించారు.

19న రక్తదాన శిబిరం

నెల్లూరు (వైద్యం) మే 14 (ఆంధ్రజ్యోతి) : కార్మికుల సంక్షేమం కోసం విశేష సేవలు అందించిన వామపక్ష యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఈ నెల 19న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సందానీ బాషా తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రకు వినతిపత్రం అందించారు. జీజీహెచ్ రక్తనిధికి రక్తదానం చేస్తున్నామని వెల్లడించారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



అశ్వవాహనంపై లక్ష్మీనరసింహుడు

నెల్లూరు రూరల్, మే 14 (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో జరుగుతున్న లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో బుధవారం శ్రీవారు అశ్వారూఢుడై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చప్పర ఉత్సవం ఘనంగా జరిగింది. అనంతరం అశ్వవాహన సేవ, పార్వేట ఉత్సవం నిర్వహించారు. చివరిగా చోర సంవాదం ఘట్టం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ చైర్మన్ ఇందుపూరు అచ్యుత శంకర్‌రెడ్డి, ఈవో గోపి, ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు, ఉభయకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహుడి కల్యాణం

వింజమూరు మండలం నల్లగొండ్లలో వెలసి ఉన్న శ్రీదేవి,భూదేవి సమేత లక్ష్మీనర సింహుడి కల్యాణాన్ని బుధవారం అంగరంగవైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ఆలయ కమిటీ చైర్మన్ ఎల్‌పీ కొండారెడ్డి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం తిరుపతి నుంచి వచ్చిన వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా స్వామి,అమ్మవార్లకు దండల మార్పిడి, ఎదురుకోలు ఉత్సవం, మంగళసూత్రధారణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారికి భక్తులు చదివింపులు చదివించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి, టీడీపీ నేత అంకినపల్లి ఓబులరెడ్డి, కలిగిరి సీఐ వెంకటనారాయణ దంపతులు, ఈవో శాంతయ్య, ఎస్‌ఐ వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

\- వింజమూరు, (ఆంధ్రజ్యోతి)



లక్ష్మీ నరసింహుడి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- మనుగడ కోల్పోతున్న ఎన్‌డీసీఎంఎస్
- షాపులపై కొరవడిన పర్యవేక్షణ
- రూ.కోట్ల ఆస్తులకు రక్షణ కరువు
- ఉన్న ఉద్యోగులపై అజమాయిషీ లేదు
- మంత్రి చెప్పినా అందని హమాలీ చార్జీలు
- కొత్త చైర్మన్ 'గంగోటి' అయినా గాడిలో పెట్టేనా!?

నాటి వైభవం.. నేడు ఏదీ!?

నెల్లూరు(హరనాథపురం), మే 14(ఆంధ్రజ్యోతి) : లాభాల బాటలో ఓ వెలుగు వెలిగిన నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఎన్‌డీసీఎంఎస్) తన మనుగడను కోల్పోతోంది. అసలు డీసీఎంఎస్ ఉందా అనే పరిస్థితికి చేరుకుంది. ఒకప్పుడు సబ్సిడీపై రైతులకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల పంపిణీ, ప్రభుత్వ వసతిగృహాలకు పల సరుకులు, ఎన్నికల సమయంలో స్టేషనరీ, టీటీడీకి కందిపప్పు తదితరాలను అందచేసింది. అంతేగాక ప్రజలకు నాణ్యమైన వస్త్రాలు, దీపావళి పండుగలో టపాకాయల విక్రయాలు ద్వారా లాభాలు ఆర్జించింది. జిల్లాలోని పలు ప్రాంతాలలో ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించేది. 2020లో ఖరీఫ్, రబీ సీజన్లలో జిల్లాలో 10 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రూ.135 కోట్ల వ్యాపారం ద్వారా రూ.2 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. రూ.6కోట్ల చిరుధాన్యాల వ్యాపారం చేసి రూ.2 లక్షల ఆదాయాన్ని ఆర్జించింది. నగరంలోని ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎరువుల దుకాణం ద్వారా రూ.17 కోట్ల విలువైన ఎరువులను విక్రయించడం ద్వారా ఆదాయాన్ని ఆర్జించింది. గత ఏడాది వరకు కూడా డీసీఎంఎస్ లాభాల బాటలోనే ఉండేది. ఆ తరువాత సదరు సంస్థకు మునలం మొదలైంది. ఎలాంటి వ్యాపారాలు చేపట్టకుండా కుదేలయ్యింది.



మూసి వున్న డీసీఎంఎస్ ఎరువుల దుకాణం

'జనరిక్'లో మందులేవీ!?

నగరంలోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జనరిక్ మందుల దుకాణాన్ని ప్రారంభించారు. అవసరమైన మందులు ఏర్పాటు చేయలేదు. జనాదరణ ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

ఆ దుకాణం ఎప్పుడూ మూతే


నగరంలోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో ఉన్న ఎరువుల విక్రయ కేంద్రం ఏ సమయంలో వెళ్లినా మూసే ఉంటోందని రైతులు ఆరోపించారు. దాని నిర్వహణకు ఒకరిని నియమించినా తలుపులు మాత్రం తెరుచుకోవడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులను ఆ దుకాణంలో అందుబాటులో ఉంచితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

విలువైన ఆస్తులకు రక్షణ ఏది

జిల్లాలో డీసీఎంఎస్‌కు విలువైన ఆస్తులు ఉన్నాయి. నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేటలో ప్రధాన కార్యాలయం ఉండగా, నగరంలోని నవాబుపేటలో రైస్‌మిల్లు కూడా ఉంది. దీని విలువ రూ.కోట్లలో ఉంది. ఈ మిల్లు శిథిలావస్థకు చేరుకోవటంతో దాని స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్, గోదాములు కట్టించి డీసీఎంఎస్‌కు ఆదాయం సమకూర్చాలని గతంలో పనిచేసిన చైర్మన్ వీరి చలపతిరావు ప్రతిపాదించి, ప్రభుత్వం నుంచి అనుమతులు కూడా తెచ్చారు. అయితే, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆత్మకూరులో డీసీఎంఎస్‌కు దుకాణాలు ఉన్నా పట్టించుకునే దిక్కేలేదు. ఈ ఆస్తులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అందని హమాలీ చార్జీలు

డీసీఎంఎస్ ద్వారా ధాన్యం సేకరించినందుకు రైతులకు హమాలీ చార్జీలను రూ.50లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గత ఫిబ్రవరిలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు తమకు హమాలీ చార్జీలు చెల్లించమని రైతులు కోరారు. మూడు రోజుల్లో ఇవ్వాలని మంత్రి కూడా అధికారులను ఆదేశించినా ఇప్పటికీ అతీగతీ లేదు. రాపూరు సబ్‌డివిజన్ సహకారశాఖాధికారి ప్రస్తుతం డీసీఎంఎస్‌కు బిజినెస్ మేనేజర్‌గా ఉన్నారు. ఆయన రాపూరుతోపాటు, ఇక్కడ బిజినెస్ మేనేజర్‌గా విధులు నిర్వహించాల్సి ఉంది. ఎరువుల అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై నవాబుపేట పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైతే దానిపై ఎలాంటి ప్రగతి లేదనేది సమాచారం.



డీసీఎంఎస్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఉద్యోగుల కుర్చీలు

సమావేశానికే దిక్కులేదు!

గత అక్టోబరు 1 నుంచి ఈ ఏడాది మార్చి 31లోగా డీసీఎంఎస్ జనరల్ బాడీ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా, దానిని ప్రత్యేకాధికారి అయిన జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి నిర్వహించలేదు. తమకు జీతాలు సక్రమంగా చెల్లించటం లేదని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో చుట్టపుచూపుగా వచ్చి వెళ్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరాలను పని చేయకుండా చేశారు. దీంతో అసలు విధుల నిర్వహణకు ఉద్యోగులు వస్తున్నారో లేదో తెలియని పరిస్థితి. మొత్తం మీద డీసీఎంఎస్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిపోయింది. డీసీఎంఎస్‌కు చైర్మన్‌గా గంగోటి నాగేశ్వరరావును ఇటీవల ప్రభుత్వం నియమించింది. మనుగడ కోల్పోతున్న డీసీఎంఎస్‌కు నాగేశ్వరరావు అయినా పూర్వవైభవం తెస్తారో లేదో వేచి చూడాల్సిందే.

హమాలీ చార్జీలు చెల్లిస్తాం

రైతులకు హమాలీ చార్జీలు రూ.50 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. త్వరలోనే చెల్లిస్తాం. కొత్త చైర్మన్ బాధ్యతలు స్వీకరించిన తరువాత జనరల్ బాడీ సమావేశం నిర్వహిస్తాం. ఉద్యోగులు సక్రమంగా విధులకు వస్తున్నారు. వారిని ఇన్‌కంటాక్సు వంటి వేరే పనులకు పంపుతుంటాం. జనరిక్ మందుల దుకాణంలో అవసరమైన మందులను సమకూర్చుతాము.

\- రవికుమార్, బిజినెస్ మేనేజర్, డీసీఎంఎస్

నాన్‌డెల్టాలో రెండో పంటకు నీరు కూటమి ఘనతే!

- కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగుమాటి, కాకర్ల

సంగం, మే 14 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం పరిధిలో నాన్ డెల్టాలో రెండో పంటకు సాగు నీరు విడుదల చేయడం కూటమి ప్రభుత్వ ఘనతేనని కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్ తెలిపారు. సంగం వద్ద బెజవాడ పాపిరెడ్డి (కావలి) కాలువకు రెండో పంటకు బుధవారం వారు నీటిని విడుదల చేశారు. ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చి కాలువ హెడ్‌రెగ్యులేటర్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మొదటి పంట సమయంలో జలాశయంలో 72 టీఎంసీలు ఉన్నా, పాలకుల నీటి నిర్వహణ లోపం కారణంగా డెల్టాలో సైతం రెండో పంటకు నీటిని విడుదల చేయలేకపోయారన్నారు. బెజవాడ పాపిరెడ్డి కాలువ పరిధిలో సుమారు 74 వేల ఎకరాలకు సుమారు 8.7 టీఎంసీల నీటిని కేటాయించాలని ఇటీవల జరిగిన ఐఏబీ సమావేశంలో నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ నీరు చివరి ఆయకట్టు వరకు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, వైస్ చైర్మన్ మధుబాబునాయుడు, ప్రాజెక్టు ఎస్‌ఈ వెంకటరమణారెడ్డి, ఈఈ నాయక్, డీఈ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



హెడ్‌రెగ్యులేటర్లు ఎత్తి బెజవాడ పాపిరెడ్డి కాలువకు నీటిని విడుదల చేస్తున్న కావలి, ఉదయగిరి ఎమ్మెల్యేలు కావ్య, కాకర్ల

అత్తారింటికి చేరిన నృసింహుడు

గోనుపల్లిలో అంబరాన్ని అంటిన సంబరాలు

గోనుపల్లిలో ఉత్సవర్ల ఊరేగింపు



రాపూరు, మే 14 (ఆంధ్రజ్యోతి) : పెంచలకోనలో అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు ముగించుకుని బుధవారం తిరిగి అత్తగారిల్లు అయిన గోనుపల్లి గిరిజన కాలనీకి పెనుశిల లక్ష్మీనృసింహుడు చేరుకున్నారు. గోనుపల్లిలో ఉన్న పెంచలస్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవ విగ్రహాలను బ్రహ్మోత్సవాల ముందు రోజు కోనకు పల్లకీలో తీసుకెళ్లి ఉత్సవాలు ముగిశాక మళ్లీ గోనుపల్లికి తీసుకురావడం ఆనవాయితీ. ఇందులోభాగంగా కోనలోని అలంకార మండపం వద్ద స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం పెంచలకోన ప్రారంభ ఆర్చి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వీడ్కోలు పలికారు. అక్కడ నుంచి బయలుదేరిన స్వామి వారి పల్లకీని మోసే బోయీలకు ఎండకు కాళ్లు కాలకుండా దారి పొడవునా ట్యాంకర్‌తో నీటిని చల్లుతూ గిరిజన కాలనీకి చేరుకున్నారు.



కోనలో స్వామివారికి వీడ్కోలు పలుకుతున్న అధికారులు, అర్చకులు

అల్లుడి రాకతో సంబరాలు

తమ ఆడపడుచు చెంచులక్ష్మిని వివాహమాడి గోనుపల్లికి సతీసమేతంగా స్వామివారు రావడంతో గోనుపల్లివాసులు సంబరాలు చేసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కాలనీలోనే స్వామి వారిని ఉంచడంతో గిరిజనులు తమ కొత్త అల్లుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గోనుపల్లిలో గ్రామోత్సవం జరిగింది. ఆలయ డిప్యూటీ కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఉప ప్రధానార్చకులు సీతా రామయ్య , పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న గోనుపల్లి వాసులు

రీ అప్పోర్షన్‌మెంట్ జాబితాలు విడుదల చేయాలి

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో పాఠశాలల రీస్ట్రక్చరింగ్ వల్ల రీ అప్పోర్షన్‌మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయుల జాబితాలను విడుదల చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు ఏ సురేంద్రరెడ్డి, ఎం పిచ్చిబాబు ఓ ప్రకటనలో కోరారు. అధికశాతం మండలాల్లో కేడర్ స్ట్రంగ్ వివరాలు, రీ అప్పోర్షన్‌మెంట్‌కు గురయ్యే ఉపాధ్యాయుల జాబితాలను బహిర్గతం చేయకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు. రీ అప్పోర్షన్‌మెంట్‌కు గురై ప్రిఫరెన్షియల్ కేటగిరి కిందకు వచ్చే వారికి మరోసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి సర్టిఫికెట్ వచ్చేలా చూడాలని కోరారు. అలాగే అన్ని వాతావరణ పరిస్థితుల్లో రోడ్డు సౌకర్యంలేని కేటగిరి-4 పాఠశాలల జాబితాను రివైజ్ చేసి తాజా జాబితాను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

సోమశిలలో 48.211 టీఎంసీల నీరు

అనంతసాగరం మే 14 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, బుధవారం నాటికి 48.211 టీఎంసీల నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పెన్నాడెల్టాకు 5,730, ఉత్తర కాలువకు 100, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని వారు తెలిపారు.

పాలిసెట్‌లో 96.49 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 96.49 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రవేశ పరీక్షకు నెల్లూరు డివిజన్‌లో నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, వీఆర్ పీజీ కళాశాల, డీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డీకే ప్రభుత్వ జూనియర్ కళాశాల, వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాలల్లో, ఆత్మకూరు డివిజన్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, సోమశిల రోడ్డులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో, కావలి డివిజన్‌లోని రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, పీబీఆర్ విశ్వోదయా కళాశాలల్లో, కందుకూరు డివిజన్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 30వతేదీ పరీక్ష నిర్వహించారు. దీనికి సంబంధించిన ఫలితాలను బుధవారం విడుదల చేయగా ఈ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు 96.49శాతం ఉత్తీర్ణత సాధించారు. పరీక్షకు బాల, బాలికలు మొత్తం 4,081 మంది దరఖాస్తు చేసుకోగా 3529 మంది హాజరయ్యారు. వీరిలో బాలురు 2,148, బాలికలు 1257 మంది కలిపి 3,405 మంది ఉత్తీర్ణతతో 96.49 శాతం సాధించారు.

తహసీల్దార్‌తో మాట్లాడుతున్న జేసీ కార్తీక్



ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్పునకు 34 ఎకరాలు : జేసీ

మనుబోలు, మే 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కనేఉన్న 34 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్పునకు కేటాయించనున్నామని జేసీ కే. కార్తీక్ తెలిపారు. బుధవారం మండలంలోని బండేపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 434లోని 34 ఎకరాల ప్రభుత్వ భూమిని నుడా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. రికార్డుల ప్రకారం సర్వే నెంబర్‌లో విస్తీర్ణం, హద్దుల గురించి తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. పేదలకు తక్కువధరకే ఇళ్లప్లాట్లు అందించేలా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌ను ప్రభుత్వం తీసుకురానున్నదన్నారు. ఈ క్రమంలో భూసేకరణ చేశామన్నారు. ఈ 34 ఎకరాల స్థలాన్ని త్వరలోనే నుడాకు అప్పగించనున్నామన్నారు. నుడా ఈ భూమిని టౌన్‌షిప్‌గా అభివృద్ధి చేయనున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్, సుబ్బయ్య, నుడా సెక్రటరీ పెంచలరెడ్డి, వీఆర్‌వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్ఐవో వరప్రసాదరావు

నెల్లూరు(విద్య), మే 13 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాథ్స్-1ఏ, 2ఏ, బోటనీ-1,2, సివిక్స్ 1,2 పరీక్షలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 15,031 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షలకు 14130 మంది హాజరు కావాల్సి ఉండగా 13626 మంది హాజరయ్యారు. 504 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1461 మంది హాజరుకావాల్సి ఉండగా 1405 మంది హాజరయ్యారు. 56 మంది గైర్హాజరయ్యారు. ఆర్ఐవో వరప్రసాదరావు 17 కేంద్రాలు, డీఈసీ సభ్యులు 9, ఫ్లైయింగ్ స్క్వాడ్ 29 కలిపి మొత్తం 55 కేంద్రాలను పరిశీలించారు. పలు కేంద్రాల వద్ద విద్యార్థులతో మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

విద్యాప్రమాణాల మెరుగునకు ప్రత్యేక వాట్సప్ గ్రూపు

- జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ

జిల్లాలోని బీసీ సంక్షేమ వసతి గృహాల్లో రాబోవు విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు, సిబ్బందికి ముఖ హాజరు ప్రవేశపెడుతున్నామని జిల్లా బీసీ సంక్షేమాధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. హాస్టల్ విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. వసతి గృహాల్లో అమలు చేయబోయే కార్యక్రమాలపై ఆమె ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి.

? విద్యాప్రమాణాల మెరుగు కోసం తీసుకుంటున్న చర్యలేమిటి

! బీసీ సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల విద్యాప్రమాణాల మెరుగునకు ప్రత్యేక వాట్సప్ గ్రూపును ప్రారంభిస్తున్నాం. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ గ్రూపును అమలులోకి తెస్తాం. ఇందులో ప్రతీ వారం అన్నీ సబ్జెక్టులకు సంబంధించి ఒక్కొక్క ప్రశ్నపత్రం పంపించి విద్యార్థులతో పరీక్షలు రాయిస్తాం. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందేలా చూస్తాం. తక్కువ మార్కులు వచ్చిన వారిని గుర్తించి వారికి మంచి విద్యాబోధన అందేలా చర్యలు తీసుకుంటాం.

? ముఖ హాజరు ఉంటుందా..

! వచ్చే జూన్‌లో హాస్టళ్ల ప్రారంభమయ్యేనాటి నుంచి విద్యార్థులకు ముఖ హాజరు ప్రవేశపెడతాం. అధికారులు, హాస్టల్ సిబ్బంది కూడా ముఖ హాజరు వేసేలా చర్యలు తీసుకుంటాం.



? విద్యార్థుల కోసం వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారా..

! జూన్ 12 నుంచి హాస్టళ్లు ప్రారంభమవుతాయి. విద్యార్థులకు తరచూ వైద్యశిబిరాలు ఏర్పాటు చేయించి, వారి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం.

? హాస్టళ్ల మరమ్మతు పనులు ఎంత వరకు వచ్చాయి.

! 35 బీసీ హాస్టళ్లలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.70 లక్షలు విడుదల చేసింది. 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు హాస్టళ్ల ప్రారంభమయ్యేలోగా పూర్తిచేయిస్తాం.

? విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తారా..

! అందచేస్తాం. హాస్టళ్ల వంట పనివాళ్లు, హెచ్‌డబ్ల్యూవోలతో సమావేశం నిర్వహించి, సీనియర్ వంట పనివారితో మిగిలిన వంట పనివారికి శిక్షణ ఇప్పిస్తాం. బిరియానీ, సాంబార్‌రైస్ వంటి రుచికరమైన వంకాలు విద్యార్థులకు అందేలా చూస్తాం.

\- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

పాలిసెట్, ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా

- ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు
- పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకుల కైవసం

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చిందన్నారు. వీరితోపాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117 మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీ స్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీపరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

జంగాలదొరువు సొసైటీ మాజీ అధ్యక్షుడి మృతి

సంగం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలదొరువు సొసైటీ మాజీ అధ్యక్షుడు సూదిలగుంట వెంకటశేషారెడ్డి (86) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన మొదటి నుంచి కాంగ్రె్స్‌లో ఉన్నారు. కొంత కాలం నుంచి అనారోగ్యంతో బాధ పడుతూ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆయన స్వగ్రామం కొరిమెర్ల. గతంలో పెరమన, కొరిమెర్ల, నీలాయపాళెం, జంగాలదొరువు పంచాయతీలు జంగాలదొరువు సొసైటీ పరిధిలో ఉండేవి. దీంతో ఆయన కొరిమెర్ల నుంచి డైరెక్టర్‌గా గెలిచి జంగాలదొరువు సొసైటీ అధ్యక్షుడిగా ఎంపికయ్యారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9069
వెండి కిలో ధర	రూ. 98,600
వెండి ఒక గ్రాము	రూ.102.60

సైబర్ క్రైమ్‌లతో అప్రమత్తంగా ఉండాలి

● సైదులు, ఏఎస్‌పేట ఎస్‌ఐ



ఏఎస్ పేట,మే14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం టెక్నాలజీ పెరగడంతో సైబర్ నేరాలు అధికమయ్యాయి. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్ పేట ఎస్‌ఐ సైదులు తెలిపారు.

? : సైబర్ క్రైం ఎలా చేస్తారు.

! : బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నా. మీ ఏటీఎం కార్డు గడువు ముగిసింది. వివరాలు తెలపాలని అడుగుతారు.ఓటీపీ నెంబరు తెలుసుకుని కార్డులోని డబ్బులు దొంగలిస్తారు. లక్కీ డ్రాలో డబ్బులు వచ్చాయి. ముందుగా ట్యాక్స్ కట్టాలని మోసం చేస్తారు.కస్టమ్స్ వద్ద పార్శిల్ చిక్కుకుపోయిందని,చట్టవిరుద్ధమైన వస్తువులు కలిగి ఉన్నారని జరిమానా విధించాలని డిమాండ్ చేస్తారు.

? : డిజిటల్ అరెస్టు అంటే...

! : నకిలీ పోలీసులు అధికారులుగా ఫోన్‌చేసి, ఆదాయానికి మించి లావాదేవీలు జరిపారు.మీ ఖాతాలో అక్రమంగా డబ్బులు వచ్చాయి. నేరపూరిత చర్యలతో మిమ్మల్ని ఆన్‌లైన్‌లో విచారిస్తామని బెదిరిస్తారు. పోలీసులు డిజిటల్ అరెస్టులు కానీ, ఆన్‌లైన్‌లో విచారణ చేయరు.

? : సైబర్ నేరాలపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

! : ఇలాంటి కాల్స్ వచ్చినపుడు అప్రమత్తంగా ఉండాలి. మీ ఖాతా నుంచి నగదు కట్ అయితే వేంటనే 1930కి కాల్ చేసి వివరాలు తెలిపాలి. మీ నుంచి నగదు పొందిన వారి ఖాతాను హోల్డ్‌లో పడతారు. న్యూడ్ కాల్స్ వస్తే భయపడకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి.

న్యూస్ బాక్స్

హనుమజ్జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక హనుమాన్ కాలువ దగ్గర వెలసి ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న విశ్వహిందూ పరిషత్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. స్థానిక పార్వతీపరమేశ్వరాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసే కార్యక్రమాలు, నిర్వహించే పూజాకార్యక్రమాలపై చర్చించారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్, ఆలయ కమిటీ సభ్యులు బాలగురవయ్య, శ్రీనివాసరావు, కార్తీక్, సుబ్బయ్య, శ్రీహరి, దుర్గాప్రసాద్, వెంకటేశ్వర్లు, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీరాజ్ ఇన్‌చార్జీ ఏఈగా బుధవారం మనోహర్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న ఏఈ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వింజమూరు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఆయనకు అదనపు బాధ్యతగా అప్పగించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్న ఆయన డిప్యూటీ ఎంపీడీవో నాగూర్‌వలికి నివేదికలు అందజేసి బాధ్యతలు చేపట్టారు.

దారి ఆక్రమించి, వరలు వేశారని ఫిర్యాదు

సంగం, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో సుబ్బరత్నమ్మ అనే మహిళ తన ఇంటి వెనుక భాగంలో ఉండే దారిని ఆక్రమించి, అందులో లెట్రిన్ గుంటకు వరలు వేశారని అదే వీధికి చెందిన సయ్యద్ గయాజ్, డాక్టర్ ఐవీ కృష్ణారెడ్డి బుధవారం డీపీవోకి ఫిర్యాదు చేశారు. వీధి ఆక్రమించి వరలు వేయడం వల్ల దారి కుంచించుకుపోయి తమకు ఇబ్బందిగా ఉందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. లెట్రిన్ గుంటలు నిండి నీళ్లు బయటకు వచ్చి పక్కనున్న తమకు, వైద్యశాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు. దీనిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి దారిలో తవ్విన గుంటలను తొలగించి న్యాయం చేయాలని కోరారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆత్మకూరు ప్రభుత్వ ఐటీఐ అధ్యాపకుడు చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని గడ్డంవారిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మాలకొండయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ రత్నయ్యల ఆధ్వర్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నిర్వహించారు. పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపు ఎలా...?

● మరమ్మతులకు గురైన బ్యాటరీ వాహనాలు
● మూలకు చేరి శిథిలావస్థకు...
● పట్టించుకునే నాథుడు కరువు





తిమ్మారెడ్డిపల్లి సచివాలయం వద్ద వినియోగంలో లేని వాహనం, వరికుంటపాడులో మూలకు చేరిన బ్యాటరీ వాహనం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మే 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగు కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. ఇందుకుగాను రూ. కోట్ల నిధులు వెచ్చిస్తున్నాయి. అయినా అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా పథకాల అమలుతీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. దీంతో ప్రభుత్వాల లక్ష్యం నీరుగారి పోతుంది. ఇలాంటి పరిస్థితే మండల కేంద్రమైన వరికుంటపాడుతోపాటు దానికి కూతవేటు దూరంలోని తిమ్మారెడ్డిపల్లిలోనూ చోటు చేసుకుంది.

● మరమ్మతులతో మూలకు..

గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి, దాన్ని సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు హరితరాయబారులకు బ్యాటరీ వాహనాలు కేటాయించారు. అవి ఏళ్ల తరబడి మూలకు చేరి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. తొలుత వరికుంటపాడుకి చెందిన వాహనం కొంతకాలం పాటు పనిచేసింది. కాలక్రమేణా మరమ్మతులకు గురవడంతో పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. దీంతో అది బస్టాండ్ సెంటర్‌లోని పంచాయతీ భవనంలో దుమ్ము,ధూళితో నిండి శిథిలమవుతోంది. అలాగే తిమ్మారెడ్డిపల్లిలో నిర్వహణ ఖర్చులు భారమవడంతో నెలల తరబడి సచివాలయ ప్రాంగణంలోనే బ్యాటరీ వాహనం వెక్కిరిస్తోంది. ఈ నేపథ్యంలో రూ. లక్షలు విలువ చేసే ఆ వాహనాలు ఏళ్ల తరబడి వినియోగంలో లేవు. తుప్పు పట్టి నాశనమవుతున్నా, అటువైపు కన్నెత్తి చూసేవారే కనిపించడం లేదు. దీంతో వాటిని చూసిన ప్రతి ఒక్కరూ అధికారుల తీరుపై అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వాహనాలను వినియోగంలోకి తీసుకురావాలని,చెత్తను సంపద కేంద్రాలకు తరలించాలని ఆయా పంచాయతీల ప్రజలు కోరుతున్నారు.

రీసర్వేను సద్వినియోగం చేసుకోవాలి



రీసర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు నాగరాజు

దుత్తలూరు(ఉదయగిరి), మే 14(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకుని, భూ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దారు వై.నాగరాజు తెలిపారు. బుధవారం మండలంలోని వెంకటంపేటలో జరుగుతున్న రీసర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సర్వే బృందానికి రైతులు సహకరించాలన్నారు. రైతులంతా తమ వద్ద ఉన్న ఆధారాలతో ఎలాంటి సమస్యల్లేకుండా సర్వే చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో వీఆర్వో వెంకట్, సర్వేయరు శివ, సర్వే బృందం తదితరులు పాల్గొన్నారు.

కోన కాలువ శుభ్రం



కోన కాలువను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల దాహార్తిని తీర్చే కోనకాలువను బుధవారం సర్పంచి పావులూరి సామ్రాజ్యం, ఉపసర్పంచి ముర్తుజా ఆధ్వర్యంలో పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. దుర్గంపై గల తొట్టిని శుభ్రపర్చడంతోపాటు నీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా కాలువ వెంట పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం బ్లీచింగ్ చల్లారు. ప్రజలకు సజావుగా చేరేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ ఎంపీడీవో కరీముల్లా తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోకి సన్మానం



ఇన్‌చార్జి ఎంపీడీవోను సత్కరిస్తున్న కార్యాలయ సిబ్బంది

అనంతసాగరం మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఇన్‌చార్జి ఎంపీడీవో రామచంద్రయ్యను సిబ్బంది సన్మానించారు. ఈవోపీఆర్డీగా ఉన్న రామచంద్రయ్యకు ఉన్నతాధికారులు అదనపు బాధ్యతలు అప్పగించడంతో శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకుడు ప్రసాద్, ఏవో మస్తాన్, శశిశర్మ, చంద్రమౌళి, జాకీర్ పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ లేక ఇలా...!



సోమలరేగడ గ్రామస్థులు ఏర్పాటు చేసుకున్న పందిరి

దుత్తలూరు(ఉదయగిరి), మే 14(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు నుంచి సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల పొడవున రూ.360 కోట్లతో 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణం చేపట్టారు. అయితే రహదారి వెంట గ్రామాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షెల్టర్లను కూల్చివేయడంతో ప్రయాణికులు, ప్రజలకు నిలువ నీడ కరువైంది.. వాటి స్థానంలో హైవే అధికారులు షెల్టర్లు నిర్మించకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మండుటెండలో బస్సుల కోసం వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. చేసేదేమీ లేక కొన్ని గ్రామాల్లో ప్రజలు నీడ కోసం పందిళ్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పటికైనా అధికారులు షెల్టర్లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

వేసవి తాపం తీర్చే తాటిముంజలు



ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): వేసవిలో చల్లదనాన్ని ఇచ్చే వాటిల్లో తాటిముంజలు ప్రధానమైనవి. వేసవిలోనే లభ్యమయ్యే వీటిని తినడంలో ఉన్న మజాయే వేరు. వింజమూరు, పామూరు, ఆత్మకూరు తదితర ప్రాంతాల నుంచి కొందరు తాటిముంజలను, తాటికాయలను తీసుకొచ్చి ముంజ రూ.5ల చొప్పున విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు బారులు తీరుతున్నారు. తాటిముంజలు తక్కువ కెలరీలతో ఎక్కువ శక్తిని శరీరానికి అందిస్తాయని, వేసవిలో వీటిని తినడం వల్ల వల్ల చాలా ప్రయాజనం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. తాటి ముంజల్లో నీరు శరీరానికి కావాల్సిన మినరల్స్, చక్కెరను అందచేస్తాయని, వేసవిలో డీహైడ్రేషన్ నుంచి కాపాడుతాయని వారు పేర్కొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎమ్మెల్యే సమీక్ష



ఫీల్డ్ అసిస్టెంట్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ప్రతిఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలన్నారు. అవినీతికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ప్రజలకు ఉపయోగపడే పనులు నిర్ణయించి, వాటినే చేపట్టాలని ఎమ్మెల్యే ఆదేశించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పంటకాలువలు, నీటికుంటల పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే గ్రామాల్లో నాయకులను సమన్వయపర్చుకుని పనులు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, ఎంపీడీవో శ్రీనివాసులరెడ్డి, ఏపీవో సుభాషిణి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రసంగాలకే పరిమితం

● సంగం మండల సమావేశంలో అభివృద్ధిపై సాగని చర్చ



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో షాలెట్

సంగం, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం ఎలాంటి చర్చలు, ప్రశ్నలు, సమాధానాలు లేకుండానే సాగింది. ఎంపీపీ పద్మావతమ్మ అధ్యక్షతన ప్రారంభమైన సమావేశంలో మొదటగా ఇటీవల కశ్మీర్‌లో అశువులు బాసిన వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, విద్యాశాఖ, డ్వామా, డీఆర్‌డీఏ, ఆర్అండ్‌బీ, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు తమ పరిధిలో జరుగుతున్న పనులను వివరించారు. హాజరైన ప్రజా ప్రతినిధులు ఎవరూ నోరు తెరవలేదు. అభివృద్ధి పనులపై చర్చించనూలేదు. కేవలం అధికారుల ఉపన్యాసాలే మాత్రమే సాగాయి. పశుసంవర్ధకశాఖ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, రెవెన్యూ, పోలీస్, అటవీశాఖ, వైద్యఆరోగ్యశాఖ అధికారులు సమావేశానికి గైర్హాజరయ్యారు. సమావేశంలో ఎంపీడీవో షాలెట్, జడ్పీటీసీ సభ్యులు లక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

విరువూరులో అక్రమ లేఅవుట్ల పరిశీలన

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరువూరులో నిబంధనలకు విరుద్ధంగా వెలసిన లేఅవుట్లను బుధవారం నుడా అధికారులు పరిశీలించారు. గ్రామ సర్వే నంబరు 548లో ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది వ్యాపారులు లేఅవుట్లు వేసి వ్యాపారాలు సాగిస్తున్నారనే ఫిర్యాదు అందింది. దీంతో శాఖ పరిధిలోని సర్వే అధికారులు వినయ్‌కుమార్, హరిశంకర్ ఆ ప్రాంతానికి చేరుకొని సర్వే చేశారు. తమ శాఖతో సహా పంచాయతీ అనుమతులు లేకపోవడంతోపాటు కన్వర్షన్ చేయించలేదని నిర్ధారించారు. కనీసం రహదారుల నిర్మాణం కూడా చేపట్టలేదని గుర్తించారు. సమీపంలోని వంక పోరంబోకు, బండ్లబాటను సైతం ఆక్రమించుకున్నారని పలువురు గ్రామస్థులు వారికి విన్నవించారు. ఎప్పటి నుంచి లేఅవుట్ పనులు జరుగుతున్నాయి...? తదితర అంశాలను అధికారులు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందచేస్తామ న్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంతియాజ్‌బేగం, సర్వేయర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగరం స్టేషన్‌లో ప్రక్షాళన జరిగేనా!?

● నిత్యం పంచాయితీల బాగోతం ● తిష్ఠవేసిన సీనియర్లు



అనంతసాగరం పోలీసుస్టేషన్ (ఫైల్)

అనంతసాగరం మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసుస్టేషన్‌లో సిబ్బంది పనితీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఫిర్యాదుదారుల పట్ల మర్యాద, కరుణ కరువైందని, కొందరు సిబ్బంది పంచాయితీల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్ఐతో సహా కొందరు సీనియర్ల బదిలీ కొంత కాలంగా జరగలేదు. గత ప్రభుత్వంలో ఉన్నవారే నేటికి కొనసాగుతున్నారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత జిల్లా వ్యాప్తంగా బదిలీలు జరగ్గా, సాగరం పోలీసుస్టేషన్‌లో మాత్రం జరగలేదు. ఇక్కడ పనిచేసే సీనియర్లను చూసి ఫిర్యాదు దారులు హడలెత్తిపోతున్నారు. వైసీపీ నాయకులు చెప్పినట్లు సిబ్బంది పనులు చేస్తున్నారనే అపవాదు ఉంది.

● ప్రైవేటు కేసుల నమోదు

ఇటీవల రేవూరుకు చెందిన ఒక వ్యక్తిని కేసు విచారణలో భాగంగా విచక్షణ రహితంగా కొట్టినట్లు సమాచారం. అతను ప్రైవేటు కేసు వేయడంతో పాటు, మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అనంతసాగరంలో ఒక రైతుకు చెందిన మూడు గేదెలను వెంగంపల్లి వద్ద కొందరు విషగుళికలు పెట్టి, రెండు నెలల క్రితం హతమార్చారు. ఈ విషయమై బాధిత రైతు ఫిర్యాదు చేయగా ఎవరూ పట్టించుకోలేదు. ఆ రైతు కూడా ప్రైవేటు కేసు వేశాడు. ఇటీవల గ్రావెల్ మాఫియాకి చెందిన రికార్డింగ్ వాయిస్ సోషల్ మీడియాలో తీవ్రచర్చకు దారితీసింది. అందులో పోలీసులకు ఇచ్చే మామూళ్ల వ్యవహారం కూడా బయట పడింది. ఇక స్టేషన్ బాస్ ఎక్కువ సమయం స్టేషన్‌లో ఉండరని, అత్యవసర సమయంలో ఫోన్ చేసినా స్పందించరని టీడీపీ నేతలు గుసగుసలాడుతున్నారు. ఈ క్రమంలో సిబ్బంది ప్రక్షాళన అవసరమని పలువురు అంటున్నారు.



ఉదయగిరిలో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

కుట్టు శిక్షణ... ఆర్థిక స్వావలంబన

● జిల్లాలో 4,967 మందికి తర్ఫీదు ఇవ్వడమే లక్ష్యం
● సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక ప్రగతి సాధించి కుటుంబానికి ఆసరగా నిలవాలి. స్వయం ఉపాధితో ఆర్థిక స్వాలంబన సాధించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వారికి కుట్టు శిక్షణ ఇస్తున్నది. ఇది మహిళల స్వయం ఉపాధికి ఊతంగా నిలువనున్నది.

● 4,967 మందికి శిక్షణ లక్ష్యం

జిల్లాలో 44 కేంద్రాల ద్వారా 4,967 మంది మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇవ్వడం లక్ష్యం కాగా, ఇప్పటివరకు 14 కేంద్రాల ద్వారా 2,400 మందికి శిక్షణ ఇస్తున్నారు. ఆయా కేంద్రాల్లో మహిళలకు ట్రైనర్ ద్వారా 90 రోజులపాటు శిక్షణ ఇస్తారు. అవకతకలు జరగకుండా ఫేషియల్ యాప్ ద్వారా హాజరు పద్ధతిని ప్రవేశపెట్టారు. దీంతో ప్రతిఒక్కరూ కేంద్రానికి వచ్చిన సమయంలో, వెళ్లే సమయంలో ముఖహాజరు వేయాల్సి ఉంది. 75 శాతానికి హాజరు తగ్గకుండా ఉంటేనే మిషన్ ఇస్తామనే నిబంధన పెట్టారు. దీంతో మహిళలు తప్పనిసరిగా శిక్షణ తీసుకోవాల్సి ఉంది. కుట్టుమిషన్‌తో వచ్చే ఆదాయంతో కుటుంబాలు ఆర్థికంగా ఎదగాలన్నదే ప్రభుత్వ ఆశయం. ఉదయగిరిలో ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రంలో 130 మంది శిక్షణ పొందుతున్నారు.

కుటుంబానికి ఆసరాగా...



ప్రభుత్వం కుట్టు శిక్షణ ఇస్తుండడంతో మహిళలకు భరోసా దక్కుతోంది. చదువులు పూర్తి చేసుకుని ఇంటి వద్ద ఉన్న యువతులకు ఇది ఎంతో ఉపయోకరంగా ఉంది. ఇంటిలో ఖాళీగా ఉండకుండా స్వయం ఉపాధి పొందవచ్చు. తద్వారా కుటుంబానికి ఆసరాగా ఉండవచ్చు.

- షేక్ నాజియ

సొంతకాళ్లపై నిలబడాలని...



సొంత కాళ్లపై నిలబడాలనే తపనతో శిక్షణకు వస్తున్నా. ప్రభుత్వం మహిళలకు చక్కటి అవకాశం కల్పించింది. ఉచితంగా శిక్షణతోపాటు కుట్టుమిషన్ ఇవ్వడం సంతోషం. శిక్షణ అనంతరం ఇంటి వద్దనే ఉంటూ నాలుగు రూపాయలు సంపాదించే అవకాశం ఉంది.

- పాదిలి అన్నపూర్ణ

పేదలకు వరం



ప్రభుత్వం పెట్టిన ఈ శిక్షణ కేంద్రం మాలాంటి పేదలకు వరం. టిఫిన్ సెంటర్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నా. కుట్టులో శిక్షణ తీసుకుంటే కుటుంబానికి ఆర్థిక వెసులుబాటు కలుగుతుందనే ఆశ.

- షేక్ షాహిన

2,400 మందికి శిక్షణ ఇస్తున్నాం

జిల్లాలో 44 కేంద్రాల ద్వారా 4,967 మంది మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడమే లక్ష్యం. ఇప్పటివరకు 14 కేంద్రాల ద్వారా 2,400 మందికి శిక్షణ ఇస్తున్నాం. త్వరలో లక్ష్యాన్ని అధిగమిస్తాం. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- నిర్మలాదేవి, బీసీ కార్పొరేషన్ ఈడీ

21 మద్యం సీసాల స్వాధీనం

ఉదయగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మర్రిపాడు మండలం కేతిగుంట, దుత్తలూరు మండలం నందిపాడు గ్రామాల్లో మద్యం బెల్టు దుకాణాలపై నెల్లూరు స్క్వాడ్ అధికారులు, స్థానిక ఎక్సైజ్ పోలీసు సిబ్బంది దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ దీప్తికరంత్ బుధవారం తెలిపారు. ఈ దాడుల్లో 21 మద్యం సీసాలతోపాటు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన వివరించారు.

జనసేనలో భగ్గుమన్న విభేదాలు : ఒకరిపై దాడి

సంగం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గ జనసేనలో కొంతకాలంగా నెలకొన్న వర్గవిభేదాలు మంగళవారం రాత్రి భగ్గుమన్నాయి. ఒక వర్గ నాయకుడిపై సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును, వేరే గ్రూపుల్లో పోస్టు చేశారని దాడి చేశారు. సేకరించిన వివరాల మేరకు, టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ వర్గాలుగా ఆత్మకూరులో జనసేన నాయకులు, కార్యకర్తలు విడివిడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో టిడ్కో చైర్మన్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో వచ్చిన పోస్టును నలిశెట్టి శ్రీధర్ వర్గానికి చెందిన సంగం మండలం తరుణవాయికి చెందిన మావిళ్ల ఆనంద్ ఇతర గ్రూపుల్లో పోస్టు చేశాడు. దీంతో టిడ్కో చైర్మన్ అనుచరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ రాజేష్ బుధవారం ఉదయం స్టేషన్‌కు రావాలని ఆనంద్‌ను పిలిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి టిడ్కో చైర్మన్ అనుచరులు కారు, నాలుగు మోటారు బైక్‌లపై సుమారు 15 మంది వెళ్లి, తరుణవాయిలోని ఆనందను బయటకు పిలిచి దాడి చేశారు. దాడిలో గాయపడిన ఆనంద్ వైద్య చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడి సిబ్బంది సూచన మేరకు 108 వాహనంలో ఆత్మకూరు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లారు. అక్కడ ఆయన చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు పోలీసులు కేసు విచారిస్తున్నారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

వెంకటాచలం, మే 14 (ఆంధ్రజ్యోతి): తనకు ఓ వ్యక్తి లైంగికంగా వేధిస్తున్నాడని, సోషల్ మీడియాలో ఫొటోలు పోస్టు చేస్తానని బెదిరింపులకు దిగుతున్నాడని బాధిత వివాహిత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని అనికేపల్లికి చెందిన ఓ వివాహిత(27)ను, అదే గ్రామానికి చెందిన బోచు బాబీ లైంగికంగా వేధిస్తున్నాడు. అంతటితో ఆగక బాధితురాలికి, ఆమె కుటుంబ సభ్యులకు నిద్రమాత్రలు ఇచ్చి కోరిక తీర్చుకుంటానని బెదిరించినట్లు ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైం), మే 14 (ఆంధ్రజ్యోతి) : వైద్యశాలలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి బుధవారం మృతిచెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని కొండాయపాళెం గేటు వద్ద ఈ నెల 10వ తేదీ గుర్తుతెలియని 30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో రోడ్డుపై పడిఉండటాన్ని గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని ఆ వ్యక్తిని జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	125
స్కిన్ చికెన్	224
స్కిన్‌లెస్	250

కోడిగుడ్ల ధర (100) : 500



ఏకే కండ్రిగ వద్ద పూడిపోయిన డీఎం చానెల్

- పూడికతీతకు నోచుకోక కనుమరుగు
- డీఎం చానెల్‌ను కమ్మేస్తున్న చిల్లచెట్లు
- మరమ్మతులకు నోచని వెల్‌సైపన్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- సాగునీరు అందక రైతుల ఆందోళన

దుస్థితిలో కాలువలు!

బిట్రగుంట, మే 14(ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలంలో సాగునీటి సరఫరా జరిగే ప్రధాన కాలువలు దుస్థితికి చేరాయి. ఏళ్ల తరబడి పూడికతీతకు నోచుకోక ఏపుగా పెరిగిన చిల్లచెట్లు, జమ్ము, పిచ్చిమొక్కలు కమ్మేసి రూపురేఖలు మారి కనుమరుగవుతోన్నాయి. వెల్‌సైపన్లు సైతం శిథిలావస్థకు చేరి కూలిపోతున్నాయి. అయినా సంబంధిత అధికారులు వాటి గురించి పట్టించుకున్న పాపానపోవడం లేదు. ఈ క్రమంలో వర్షాలు పడి, జలాశయాల నుంచి నీటిని విడుదల చేసిన సమయంలో సాగునీరు సక్రమంగా అందే పరిస్థితి లేకుండాపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. బోగోలు, తాళ్లూరు, బిట్రగుంట, ముంగమూరు తదితర పంచాయాతీల రైతులకు అనువైన డీఎం చానెల్ కర్రతుమ్మ చెట్లతో కమ్ముకుపోయింది. సోమశిల జలాశయంలో, చెరువుల్లో పుష్కలంగా నీరు ఉండటంతో రెండో కారు పంటకు సాగునీరు విడుదల చేస్తున్న పరిస్థితుల్లో ఈ కాలువలు దుస్థితిలో ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ కాలువల గురించి పట్టించుకున్న నాథుడే లేకపోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కావలి కాలువ నుంచి వచ్చే ఎస్వీపీఎం కాలువ పూడికతీత పనులు తాళ్లూరు వరకు జరిగాయి. అయితే కాలువలో పూడికతో పాటు తెల్లరాళ్లు పడి ఉండటం వలన సాగునీరు సాగేందుకు ఇబ్బందిగా ఉందని రైతులు అంటున్నారు. పడమర పల్లెలో రైతులు వేరుశనగ వేసేందుకు సమాయత్తమవుతోన్నారు. కాగా నాగులవరం వద్ద ఉన్న వెల్‌సైపన్ మూడేళ్ల క్రితం తుఫాన్‌కు దెబ్బతినడంతో నామమాత్రపు మరమ్మతులు చేశారు. నాగులవరం ఉత్తరం నుంచి శ్రీవేంకటేశ్వరపాలెం వైపు వెళుతున్న ఎస్వీపీఎం కాలువ తాళ్లూరు ఆర్అండ్‌బీ రోడ్డుకు దక్షిణం వైపు ఉన్న వెల్‌సైపన్ పడిపోయి నెల లు కావస్తున్నా పట్టించుకున్న పాపానపోలేదు. ఎస్వీపీఎం కాలువ నుంచి దామవరం కాలువ, నాగులవరం చెరువుకు నీటి విడుదలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన షెట్టర్లు, గోడలు పూర్తిగా దెబ్బతిని పడిపోయి నాలుగేళ్లు అవుతున్నా ఇంతవరకు పట్టించుకున్నా నాథుడేలేడు. దీంతో నాగులవరం చెరువు కింద ఉన్న రైతులకు దామవ రం, నారాయణపురం రైతులకు సాగునీరు సక్రమంగా అందక ప్రతి ఏటా సాగునీటికి గొడవలు జరుగుతోన్నాయి. అలాగే ఎనిమిదేళ్ల క్రితం వేసిన జీప్‌ట్రాక్‌లో పెద్దపెద్ద గోతులు ఏర్పడి రైతులు పొలాలకు వెళ్లిరావాలంటే నరకంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత వేసవి కాలంలోనైనా కాలువల పూడికతీతతో పాటు దెబ్బతిన్న షెట్టర్లు, వెల్‌సైపన్ల పనులను చేపడితే వరి సాగు చేసే రైతులతో పాటు వేరుశనగ సాగు చేస్తున్న రైతులకు ఇబ్బంది లేకుండా ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షాకాలంలో రైతులు తీవ్ర ఇబందులు పడకుండా జీప్‌ట్రాక్ నిర్మాణ పనులు చేయాలని కోరుతున్నారు.



తాళ్లూరు ఆర్అండ్‌బీ రోడ్డు పక్కన కూలిన వెల్‌సైపన్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

తూములు, షెట్టరు పరిస్థితిని ఇటీవల నెల్లూరులో జరిగిన సమావేశంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు పోయాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం. తాళ్లూరు వద్ద సైపన్‌కు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నాం.

- వెంకటేశ్వర్లు, ఏఈ, ఎస్వీపీఎం సెక్షన్-2

గృహాల స్వభావం నిర్ధారణకే సర్వే

● శావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్



కావలి, మే 14 (ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో గృహముల స్వభావంను నిర్ధారించేందుకే ప్రత్యేక బృందాలు సర్వే చేసి ఇళ్ల కొలతలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలో కావలినే పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసుకుని సర్వే చేస్తున్నారు. ఇంటి పన్నులు పెంచేందుకు సర్వే చేస్తున్నారని ప్రజలు ఆందోళన పడుతుండడం తమ దృష్టికి వచ్చింది. అది నిజం కాదు. ఇళ్ల స్వభావాలను బట్టి భవిష్యత్తులో ఇళ్ల ప్లానులు సరళీకృతం చేయడానికి ఈ సర్వే చేస్తున్నారని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు.

? పట్టణంలో ఇళ్ల కొలతలు తీస్తున్నారు.. మళ్లీ ఆస్తి పన్ను పెంచుతున్నారా.

! గృహముల స్వభావం నిర్ధారించుకొనుటకే ఇళ్ల సర్వే చేసి వాటి నిర్మాణాల కొలతలను కొలుస్తున్నారు. పన్నులు పెంచడానికి కాదు.

? రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీలలో సర్వే చేస్తున్నారా.. లేక కావలిలోనేనా.

! రాష్ట్ర వ్యాప్తంగా కావలి మున్సిపాల్టీని పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసుకుని ఇక్కడే సర్వే చేస్తున్నారు.

? సర్వేలో ఎన్ని టీములు ఉన్నాయి. స్థానిక సిబ్బందేనా.. బయటనుంచి ఎవరైనా వచ్చారా.

! పట్టణంలో 28 సచివాలయాలలో సచివాలయానికి ఒక టీం వంతున 28 టీమ్‌లు సర్వేలో పాల్గొంటున్నాయి. స్థానిక సచివాలయ సిబ్బంది సర్వే చేస్తుండగా మున్సిపల్ పట్టణ ప్రణాళికా విభాగం నుంచి వచ్చిన వారు పర్యవేక్షిస్తున్నారు.

? ఇంటి పన్నులు పెంచేందుకే సర్వే చేస్తున్నారనే యాజమానుల ఆందోళన చెందటంలో వాస్తవం ఉందా.

! భవిష్యత్తులో ఇంటి నిర్మాణాల ప్లానులు సరళీకృతం చేయడం కోసం గతంలో తీసుకున్న ప్లానులకు, కట్టిన నిర్మాణాలకు వ్యత్యాసం తెలుసుకునేందుకే సర్వే చేసి ఇళ్ల కొలతలు తీసుకుంటున్నారు. ఇళ్ల పన్నులు పెంచుతున్నారని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ



టీడీపీ నేత సంజయ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

బిట్రగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని పలువురు టీడీపీ నేతలను కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి బుధవారం పరామర్శించారు. బేతనీపేటకు చెందిన టీడీపీ యువనాయకుడు జీ.సంజయ్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందాడు.ఎమ్మెల్యే ఆయను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. చెంచులక్ష్మీపురంకు చెందిన కాండ్ర రమ మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఓ టీడీపీ నేత తల్లి జయమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు నాగేశ్వరరావు, ఎం.వెంకయ్య, మధుబాబునాయుడు, సిద్ధు, రఘురాంనాయుడు, ప్రభాకర్, సుధీర్‌బాబు, వెంకటేశ్వర్లు, సుభాని తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం తగదు

● ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజల నుంచి వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టరు తిరుమణి శ్రీపూజ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రత్యేక ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సబ్‌కలెక్టరు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రజావిజ్ఞప్తుల పరిష్కార వేదికలో అన్నిశాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేయవచ్చని ప్రకటించినప్పటికీ ప్రధానంగా రెవెన్యూకు సంబంధించిన మ్యూటేషన్, సర్వే సమస్యలపైనే అర్జీలు అందాయి. మొత్తం 28 అర్జీలు రాగా ఫించన్‌కోసం, కుటుంబ సమస్యపై ఒక్కో అర్జీ రాగా మిగిలిన అన్ని అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. దీంతో ఆయా గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు లావణ్య పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే ఇంటూరి అభినందన



సివిల్ సర్వీస్ ర్యాంకర్ అన్నా కౌశిక్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణానికి చెందిన వడ్లమూడి చెంచురామయ్య మనవడు అన్నా కౌశిక్ ఇటీవల జరిగిన యూపీఎస్సీ అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 225వ ర్యాంక్ సాధించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం పట్టణంలోని చెంచురామయ్య నివాసంకు వెళ్లి కౌశిక్‌ని శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందచేశారు. నియోజకవర్గ యువతకు ఆదర్శంగా నిలిచినందుకు స్వీట్ తినిపించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నే రోశయ్య, పిడికిటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

లింగసముద్రం మండలం మాలకొండరాయునిపాలెం గ్రామానికి చెందిన చేబ్రోలు జ్యోతికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.65,939 చెక్కును బుధవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పేదల వైద్య ఖర్చుల కోసం ఇతోధికంగా నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు పేదప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

గౌతమ బుద్ధుడి జయంతి

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో ధర్మచక్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గౌతమబుద్ధుని జయంతి సభను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దేశానికి, యువతకు గౌతమబుద్ధుడు అందించిన సందేశం ఆచరణీయంగా ఉన్నాయన్నారు. భారతీయుల మనసుల్లో గౌతముడు ఆదర్శపురుషుడిగా చిరస్మరణీయంగా ఉన్నాడన్నారు. ఈ సందర్భంగా బీహార్ బుద్ధగయలోని బౌద్ధమహావిహారాన్ని బౌద్ధులకే అప్పగించాలని జరుగుతున్న ప్రపంచ బౌద్ధుల నిరసన శాంతి ఉద్యమానికి కొవ్వొత్తులు వెలిగించి మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ధర్మచక్ర ఫౌండేషన్ ఉపాసక గాండ్ల హరిప్రసాద్, డి.వీరనారాయణ, గేరా చిరంజీవి, పాలేటి కోటేశ్వరరావు, అల్లు వెంకటేశ్వర్లు, కల్లగుంట మోహనరావు, పోకూరి కోటయ్య, ముప్పవరపు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న టీం సేవియర్స్ సభ్యులు

కావలి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కావలి రెడ్‌క్రాస్ భవనంలో టీం సేవియర్స్ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యుడు నల్లిపోగు ప్రణీత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రభుత్వ ఖాజీ, సంఘసేవకులు డాక్టర్ ముక్తీ ఖలీల్ అహ్మద్ ప్రారంభించి మాట్లాడుతూ టీం సేవియర్స్ సమాజానికి మంచి సేవలు అందిస్తున్నారని కొనియాడారు. ఈశిబిరంలో 30 మంది రక్తదానం చేయగా ఆర్టీసీ ఉద్యోగి జే.శ్రీనివాసులురెడ్డి 34వ సారి, రెడ్‌క్రాస్ ఉద్యోగి పద్మావతి 29వ సారి, టీంసేవియర్స్ సభ్యుడు కొండూరు వినీల్, ప్రయివేట్ స్కూల్ ఉపాధ్యాయుడు నెల్లూరు సెబాష్ 20వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ డీ.రవిప్రకాష్, వైస్ చైర్మన్ కే.హరినారపరెడ్డి, కోశాధికారి ఆరికట్ల మధుసూదనరావు, రెడ్‌క్రాస్ బాధ్యులు పామూరు శ్రీధర్, కలికి శ్రీహరిరెడ్డి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, రక్తకేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమ్య, తదితరులు పాల్గొన్నారు.

యానాది రైతులవే తొలగించడం అన్యాయం

● ఆర్డీవో కార్యాలయం వద్ద దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా



ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దళిత, గిరిజనులు

కావలి, మే 14(ఆంధ్రజ్యోతి): అల్లూరు మండలం పురిణి చెరువులో ఆక్రమణల తొలగింపులో పెద్ద పెద్ద రైతులను వదిలి కేవలం యానాది రైతులనే తొలగించడం అన్యాయమని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. ఈ మేరకు దళిత సంఘర్షణ సమితి, యానాది సమాఖ్య ఆధ్వర్యంలో దళిత, గిరిజన కుటుంబాలతో కలిసి బుధవారం కావలి ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ పెద్ద పెద్ద రైతుల ఆక్రమణలను వదిలి యానాదులకు సంబంధించి కట్టలను మాత్రమే తొలగించి ఆ భూములను చెరువులో కలపడం యానాదుల పొట్ట కొట్టడమేనన్నారు. యానాదుల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ మాట్లాడుతూ యానాదులపై కక్ష సాధింపు ధోరణితో వ్యవహరించిన ఈ ఆక్రమణల తొలగింపు విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పోరాడుతామన్నారు. అనంతరం ఆర్డీవో ఎం.సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో చౌటూరి భాస్కర్, చౌటూరి ప్రసాద్, కత్తి పద్మ, పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

కమనీయం వేణుగోపాలుడి కల్యాణం



వేణుగోలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఉలవపాడు, మే 14(ఆంధ్రజ్యోతి): ఉలవపాడులో జరుగుతున్న వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా ఆలయం ఆరుబయట మండపంలో జరిగింది. టీటీడీ వేద పండితుల మంత్రోచ్చరణలతో జరిగిన ఈ కల్యాణానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి కోవూరు ఎమ్మెల్యే, టీడీపీ బోర్డు మెంబరు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రతిఏటా స్వామివారి కల్యాణం ఆలయ ప్రాంగణంలోని మండపంలో జరిగేది. అక్కడ ఖాళీలేక కొందరు భక్తులు బయటే నిలబడి కల్యాణం అనంతరం స్వామివారి దర్శనం చేసుకునేవారు. తొలిసారి ఆరుబయట స్వామివారి కలాణ్యం ఈవో శ్రీనివాస్, ధర్మకర్త సుధీష్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరగడంతో భక్తజనం తిలకించారు. 100 ఏళ్ల పైన చరిత్ర ఉన్న రథం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో తాత్కాలిక రథం ఏర్పాటు చేసి తిరువీధుల్లో ఊరేగించారు.

తహసీల్దారు శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ



తహసీల్దారు శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ, ఆర్ఐ, సర్వేయర్లు

వలేటివారిపాలెం, మే 14(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం తహసీల్దారుగా శీలం శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఒంగోలు రూరల్ మండలం డిప్యూటీ తహసీల్దారుగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దారుగా ఉన్న డిప్యూటీ తహసీల్దారు షేక్ నాయబ్‌రసూల్ పదోన్నతిపై ఒంగోలు రూరల్ మండల తహసీల్దారుగా వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసరావుకు డీటీ నాయబ్‌రసూల్, ఆర్ఐ ప్రసాద్, మండల సర్వేయర్ గోపిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో హోమ పూజలు



హోమ పూజలు నిర్వహిస్తున్న అర్చక స్వాములు

కావలిటౌన్, మే 14(ఆంధ్రజ్యోతి) పరివార సమేత వాసవీ కన్యకాపరమేశ్వరి పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా బుధవారం హోమం పూజలు నిర్వహించారు. ఉదయం అర్చక బృందంచే గురు ప్రార్థన, గోపూజ, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, అఖండ దీప స్థాపనం, అంకురార్పణ, యాగశాల సంస్కారం, చతుర్వేద పారాయణం, వాస్తు నవగ్రహ యోగిని, అగ్ని ప్రతిష్ఠ, గణపతి సుబ్రమణ్య వాస్తు హోమములు, మహా మంగళ హారతి, మంత్ర పుష్పం పూజల అనంతరం తీర్థప్రసాదాల పంపిణీ చేశారు. సాయంత్రం ఆవాహిత దేవతా పూజ, బింబశుద్ధి అగ్ని ఉత్తరణ హోమం పూజలు జరిగాయి. మంగళవారం జరిగిన కలశాల ప్రదర్శనను దిగ్విజయం చేసిన భక్తజనానికి అలయ కమిటీ పెద్దలు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ శాశ్వత గౌరవాధ్యక్షుడు కందుకూరి సత్యనారాయణ, గ్రంధి రమేష్, అధ్యక్షుడు వోలేటి నాగేశ్వరరావు, కార్యదర్శి చీదెళ్ల రామచంద్రారావు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అలేఖ్య, కనమర్లపూడి నారాయణ, అమరా వేదగిరి పాల్గొన్నారు.

నేడు కావలి మండల సమావేశం

కావలి రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాయంలో ఎంపీపీ ఆలూరు కొండమ్మ అధ్యక్షతన గురువారం ఉదయం 10 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ సభ్యుడుతో పాటు అన్నిశాఖల అధికారులు పాల్గొనాలని తెలిపారు. కాగా ఈనెల 6వ తేదీన జరిగిన మండల సమావేశానికి వైసీపీకి చెందిన ఎంపీటీసీలు డుమ్మా కొట్టడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు. ఈ సారైనా వారు సమావేశంలో పాల్గొని ప్రజా సమస్యలపై చర్చిస్తారా డుమ్మా కొడతారా అని మండలంలో చర్చించుకుంటున్నారు.

ఎడగారు సాగుకు సన్నద్ధం

అల్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి) : ఎడగారు సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో 18 వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు సాగునీటి విడుదలకు అధికారులు సన్నాహాలు చేస్తున్న క్రమంలో ఇప్పటికే పలు ప్రాంతాల్లో రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. కొంతమంది రైతులు డ్రమ్‌సీడర్ ద్వారా విత్తనాలను నేరుగా పొలంలో చల్లే ప్రక్రియను చేపట్టగా అత్యధికమంది రైతులు నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. దుక్కి దున్ని భూములను చదును చేసుకున్న క్రమంలో మరో పది రోజుల నుంచి వరినాట్లు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. కాగా కెఎన్ఎం 733 రకం సాగు చేపట్టే రైతులు నారు పీకే వారం రోజుల ముందు 3జి గుళికలను వినియోగించుకోవాలని, తద్వారా ఉల్లికోడు, తెల్ల తెగులు నివారించుకోవచ్చని వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు సూచిరచారు. అదేవిధంగా ఈ రకం వరి నారు పీకేందుకు గట్టిగా ఉంటుందని, మూడు రోజుల ముందు నారుమడిలో జిప్సమ్ చల్లుకోవడం ద్వారా భూమి గుల్లబారి నారు సులువగా వస్తుందని తెలిపారు.



ఎడగారుకు సిద్ధం చేస్తున్న నారుమడి

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

కందుకూరు, మే 14(ఆంధ్రజ్యోతి): గుడ్లూరు మండలం చెంచిరెడ్డిపాలెంలో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు నరాల శ్రీనివాసరెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తక్షణం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ నేతి మహేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ బాబులు డిమాండ్ చేశారు. బుధవారం వారు చెంచిరెడ్డిపాలెం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మహేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయం నష్టాలు వస్తుండటంతో రైతులు వ్యవసాయాన్ని వదిలి వలసలు వెళ్లిపోయారని, శ్రీనివాసరెడ్డి వ్యవసాయంపై మక్కువతో అప్పులపాలై తణువు చాలించడం దురదృష్టకరమన్నారు. సీపీఐ నేత బూసి సురేష్‌బాబు, దామా కృష్ణయ్య, మాధవ, ఆనంద్ మోహన్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

రహదార్ల వెంబడి ఫ్లెక్సీలు!

● ప్రమాదాలకు కారకాలు



ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

కలిగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారి వెంబడి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదాలకు కారకాలుగా మారిపోయాయి. కలిగిరి-కావలి రహదారి ప్రాంతంతో పాటు కలిగిరి పట్టణంలో తహసీల్దారు కార్యాలయం, ఆర్టీసీ బస్‌స్టేషన్, ఆర్అండ్‌బీ బంగ్లా, బస్‌స్టేషన్ ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. రాజకీయ నాయకులతోపాటు, హాస్పిటల్స్, బంగారు దుకాణాలు, వస్త్ర దుకాణాలు ఇలా పలు వ్యాపారసంస్థలు ప్రధాన కూడళ్లలో తమ వ్యాపార విస్తరణకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు పంచాయతీ అనుమతులు ఏమాత్రం లేవు. వీటికితోడు పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు చిన్నపాటి గాలులకు ఒరిగిపోయి ప్రమాదకరంగా తయారై ఉన్నాయి. అదేవిధంగా ప్రధాన కార్యాలయాలు, బస్‌స్టేషన్‌ల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో వివిధ పనులపై కార్యాలయాలకు, బస్‌స్టేషన్‌లకు వచ్చేవారికి ఇబ్బందికరంగా మారిపోయాయి. అనుమతులు లేకుండా రహదారులపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చంపుతామని బెదిరించి దోచుకెళ్లారు

నెల్లూరు(క్రైం), మే 14(ఆంధ్రజ్యోతి): రైలుదిగి నడుచుకుంటూ వెళుతున్న వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు చంపుతామని బెదిరించి నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన బుధవారం నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ సమీపంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... సంగం మండలం మర్రిపాడు గ్రామానికి చెందిన వీరరాఘవయ్య పది రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న కుమార్తెల వద్దకు వెళ్లాడు. బుధవారం తెల్లవారుజామున రైలులో నెల్లూరుకు చేరుకుని రైలుదిగి ఆత్మకూరు బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని ఆరుగురు వ్యక్తులు రెండు బైక్‌లలో వచ్చి వీరరాఘవయ్యను అడ్డుకున్నారు. కత్తితో చంపుతామని బెదిరించి అతని వద్ద నుంచి రూ.1000 దోచుకెళ్లారు. దీంతో బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18న ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు

నెల్లూరు(విద్య), మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 18న గొలగమూడిలోని ఫన్ పార్కు కన్వెన్షన్ హాలులో ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై సుమన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.



గంగమ్మ విశ్వరూపం

చెంపనరికిన పేరంటాలు

ముగిసిన తిరుపతి జాతర

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనం.. చెంప నరుకుడుతో వారం రోజుల తిరుపతి జాతర వేడుక ముగిసింది. అమ్మవారి విశ్వరూప దర్శనం కోసం మంగళవారం అర్ధరాత్రి నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తులు నిరీక్షించారు. ఈసమయంలో దర్శనం నిలిపి ప్రధాన గేట్లు మూసివేయడంతో పలువురు జనసేన కార్యకర్తలు ఆందోళనకు దిగారు. కొందరు మద్యం మత్తులో హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో పేరంటాళ్ల వేషం ధరించిన కైకాల కులస్థుడు గంగమ్మ ఆలయానికి చేరుకున్నారు. ఆ సమయంలో గేటు మూసి ఉండటంతో పేరంటాళ్ల వేషధారి సాంబ అసంతృప్తిచెంది అలకబూనారు. ఆలయ మాజీ చైర్మన్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, ఇతర సిబ్బంది ఆయన్ను ఓదార్చి విశ్వరూపం వద్దకు తీసుకొచ్చారు. భక్తుల అమ్మవారి నామస్మరణల మధ్య పేరంటాళ్లు చెంప నరికారు. ఆ ప్రతిమ మన్ను కోసం భక్తులు ఎగబడ్డారు. కాగా మంగళవారం అర్ధరాత్రి నుంచీ మగాళ్లు ఆడ వేషాలు ధరించి డప్పుల వాయిద్యాలతో బృందాలుగా ఏర్పడి చిందులేస్తూ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. మహిళలు సైతం పూనకంతో ఊగిపోతూ కనిపించారు. ఆలయానికి చేరుకుని వజ్రకిరీటధారి అయిన గంగమ్మను దర్శించుకున్న అనంతరం విశ్వరూప దర్శనం కోసం అక్కడే ఉండిపోయారు. చెంప నరుకుడు కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య దంపతులు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు మహేష్ యాదవ్, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

పాలిసెట్‌లో 96.26% పాస్

- ఉత్తీర్ణత శాతంలో బాలికలదే పైచేయి
- జిల్లా స్థాయి తొలి మూడు స్థానాల్లో బాలుర హవా

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ ఫలితాలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. జిల్లాలో 4650 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 4476 మంది (96.26శాతం) ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 2989 మంది బాలురకుగాను 2853మంది (95.45 శాతం), 1661 మంది బాలికలకుగాను 1623మంది (97.71 శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలురు కన్నా బాలికలు 2.26 శాతం ఎక్కువ ఉత్తీర్ణతను నమోదు చేశారు. ఇక, జిల్లాలో తొలి మూడు ర్యాంకులను బాలురు సాధించారు. వీరిలో 119 మార్కులతో ఎస్.జతిష్‌మోహన్‌సాయి జిల్లా స్థాయి తొలి ర్యాంకు (రాష్ట్ర స్థాయిలో 51).. పి.సిద్దార్థ 2వ (రాష్ట్రస్థాయి 66).. 118మార్కులతో ఎన్.మోహిత్ మూడో (రాష్ట్రస్థాయిలో 114) ర్యాంకు కైవసం చేసుకున్నారు.

ఎస్వీయూ రీజియన్: బాలుర విభాగంలో 119 మార్కులతో ఎ.ఖాదర్‌బాషా, కె.సాత్విక్, ఎస్.జతిష్‌మోహన్‌సాయి.. బాలికల విభాగంలో 119మార్కులతో ఎన్.హారికమోహన్, 118 మార్కులతో వి.చంద్రకళ, 117 మార్కులతో ఎస్.వెంకటకీర్తి ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారని ఎస్వీప్రభుత్వ పాలిటెక్నిక్ వర్గాలు తెలిపాయి.

19 మండలాల్లో తాగునీటికి రూ.1.72 కోట్లు

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 19 కరువు రహిత మండలాల్లో తాగునీటి అవసరాలకోసం ప్రభుత్వం రూ.1.72 కోట్లు మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 19 జిల్లాల్లో 244 కరువురహిత మండలాల్లో ప్రస్తుత వేసవిలో తాగునీటి సరఫరాకు ప్రభుత్వం రూ.28 కోట్లు కేటాయించింది. అందులో జిల్లా పరిధిలో 19 మండలాలున్నాయి. ఈ మండలాల్లో వేసవి కార్యాచరణ ప్రణాళిక కింద తాగునీటి సరఫరా చేపట్టేందుకు ఈ నిధులు వినియోగిస్తారు.

దుగరాజపట్నం దశ తిరుగుతోంది!



పోర్టు ఆగిందన్న బాధ ఇంతకాలం వారిని పట్టి పీడించింది. ఇప్పుడే స్థానంలో నౌకా నిర్మాణం ఏర్పాటుకు ఎన్డీయే ప్రభుత్వం సంకల్పించింది. దుగరాజపట్నంలో రూ.3,500 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో ఈ యూనిట్ స్థాపించేందుకు చర్యలు తీసుకున్నట్లు మంగళవారం సచివాలయంలో సీఎం చంద్రబాబు ప్రకటించారు. కేంద్ర పోర్టులు, షిప్పింగ్, వాటర్‌వేస్ అధికారులతో సమావేశమయ్యారు. తమ ప్రాంత అభివృద్ధికి అడుగులు పడుతుండటంపై స్థానికులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి



తూపిలిపాళెం సముద్రతీరంలో మత్స్యకారుల పడవలు

తూపిలిపాళెం వద్ద సముద్రతీరం

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో నౌకా నిర్మాణ కేంద్రం
- రూ.3,500 కోట్ల వ్యయం
- వేల మందికి ఉపాధి

వాకాడు మండలం దుగరాజపట్నం వద్ద 15 ఏళ్ల కిందట ఓడరేవు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. దీనికి 2014లో తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, పామంజి, వాగ్రు, శ్రీనివాసపురం గ్రామాల్లో ప్రత్యేక సర్వే నిర్వహించారు. సుమారు 2,700 ఎకరాలు తూపిలిపాళెం రెవెన్యూపరిధిలో గుర్తించారు. ఆ తర్వాత ఈ ప్రక్రియ నిలిచిపోయింది. విభజనహామీ చట్టంలోనూ దుగరాజపట్నం పోర్టును పొందుపరిచినా ఆ దిశగా ముందుకు సాగలేదు. ఇక్కడికి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో కృష్ణపట్నం పోర్టు ఏర్పాటవడం.. దుగరాజపట్నం పోర్టు ఆగడంతో స్థానికుల్లో ఆవేదన నెలకొంది. ఈ క్రమంలో దుగరాజట్నం పోర్టు స్థానంలో తూపిలిపాళెంలో రెండు వేల ఎకరాల్లో రూ.3,500 కోట్లతో నౌకా నిర్మాణ కేంద్రం, ఓడల మరమ్మతుల యూనిట్ ఏర్పాటు చేసేలా ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో షిప్ బిల్డింగ్, రిపేర్ యూనిట్ ఏర్పాటు చేయనున్నారు. నౌకా నిర్మాణ కేంద్రానికి అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు మరో వెయ్యి ఎకరాలను సేకరించేలా నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుకు భూసేకరణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో పోర్టు నిర్మాణానికి 2,700 ఎకరాలను సర్వేచేసి గుర్తించి ఉండటంతో భూసేకరణ ప్రక్రియ మరింత సులభతరంగా, వేగవంతగా జరగనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి సుమారు రూ.26,000 కోట్ల పెట్టుబడులు వచ్చే వీలుంటుందని అధికారుల అంచనా. ఇక, నౌకా నిర్మాణ కేంద్రం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 40 వేల మందికి ఉపాధి, ఉద్యోగావకాశాలు దక్కుతాయని అధికారుల సమీక్షలో సీఎం తెలిపారు. ఈ నిర్ణయంతో తమ ప్రాంతానికి మహర్దశ రానుందని స్థానికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

రూపుమారనున్న తూపిలిపాళెం

చిల్లకూరు, కోట, వాకాడు మండలాలల్లోని సముద్రతీరాలలో తూపిలిపాళెం బీచ్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ఎవరైనా బీచ్‌కు వెళ్లాలంటే ముందుగా గుర్తొచ్చేది తూపిలిపాళెమే. ప్రశాంతమైన వాతావరణం, చల్లని అలల హోరు, ఆహ్లాదకరమైన సూర్యోదయం, సూర్యాస్తమయం వంటి దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు ఈ బీచ్‌ను ఇష్టపడతారు. ఇక, మత్స్యకారులూ ఇక్కడి నుంచే పడవలతో సముద్రంలోకి వేటకు వెళతారు. ఇంతటి ప్రాధాన్యమున్న ఈ బీచ్‌ను పర్యాటకంగా అభివృద్ధి చేయలేదు.కానీ, నౌకా నిర్మాణ కేంద్రం, ఇతర పరిశ్రమలు ఏర్పాటైతే తూపిలిపాళెం రూపురేఖలు మారడంతో పాటు పర్యాటకంగా బీచ్ అభివృద్ధి చెందనుంది.

పారిశ్రామిక అభివృద్ధికి అడుగులు

ఎన్డీయే అధికారంలోకి రావడంతో గూడూరు నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే చిల్లకూరు, కోట మండలాల్లో క్రిస్‌సిటీ పేరిట 10 వేల ఎకరాలకుపైగా భూముల్లో పారిశ్రామికవాడ ఏర్పాటు కానుంది. ఈ మొదటి దశ పనులు చిల్లకూరు మండలంలో వేగంగా జరుగుతున్నాయి. వీటితో పాటు కృష్ణపోర్టును అనుసంధానం చేసేలా చిల్లకూరు, కోట మండలాల్లో సాగరమాల రోడ్డు పనులు చేపట్టారు. ఇప్పుడు వాకాడు మండలంలోని దుగరాజపట్నంలో నౌకా నిర్మాణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీటితో తీరప్రాంతాలలో పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడనుంది.



తూపిలిపాళెం వద్ద సముద్రమార్గంలో వెళుతున్న నౌక

జీవకోనకు అండగా 'ఆంధ్రజ్యోతి'

అక్షరం అండగా...ఆంధ్రజ్యోతి సదస్సులో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

జేఎంసీ ట్రస్టు నుంచి రెండు ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు

నేడు ప్రారంభించనున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగరంలోని జీవకోనలో మూడు నెలల కిందట ఏర్పాటుచేసిన సదస్సులో ప్రజలు నివేదించిన సమస్యలకు పరిష్కార చర్యలు మొదలయ్యాయి. సదస్సులో ప్రజలు కోరిన సురక్షిత తాగునీటిని అందించేందుకు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శ్రీకారం చుట్టారు. ఆయనకు సంబంధించి జేఎంసీ ట్రస్టు తరపున రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. జీవకోన దాహార్తి తీర్చేందుకు సొంత నిధులతో ఆర్వో ప్లాంటు ఏర్పాటుచేస్తానని ఆంధ్రజ్యోతి సదస్సులో ఎమ్మెల్యే హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అక్కడి అవసరాలను గుర్తించి ఒకటి కాకుండా రెండు ఆర్వో ప్లాంట్లు అవసరమని భావించారు. జీవకోనలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఒకటి, జీవలింగేశ్వర ఆలయంలో మరొకటి ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని ఈ ప్లాంట్లను ప్రారంభించనున్నారు.

ఇప్పటికే పరిష్కారమైనవి

- బోర్లు మరమ్మతులు చేశారు.
- సత్యనారాయణపురం, అమెరికన్ బార్ సర్కిల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు తొలగించారు.
- తిరుమల బైపాస్ రోడ్డునుంచి సత్యనారాయణపురం వెళ్లే 30 మీటర్ల రోడ్డును కార్పొరేషన్ అధికారులు త్వరితగతిన పనులు చేపట్టి పూర్తిచేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది తప్పింది.
- పారిశుధ్య పనులను మెరుగ్గా చేపడుతున్నారు. మురుగునీటి కాలువల్లో స్ప్రే చేయడంతో పాటు రాత్రివేళల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. చెత్తకుప్పలు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.



జీవకోనలో నేడు ప్రారంభం కానున్న ఆర్వో ప్లాంటు

ఆంధ్రజ్యోతి సదస్సులో చెప్పినవన్నీ నెరవేరుస్తాం

జీవకోనలో ఆంధ్రజ్యోతి చేపట్టిన సదస్సులో చెప్పినవన్నీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. బుధవారం ఆయన ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ, ఆర్వో ప్లాంట్లుతో పాటూ పోలీస్ అవుట్ పోస్టు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుపతి ఐఐటీకి రూ.2,300 కోట్లు

ఏర్పేడు, మే 14(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు వద్దనున్న కేంద్రియ విద్యా సంస్థ తిరుపతి ఐఐటీకి కేంద్ర ప్రభుత్వం రూ.2,300 కోట్లు మంజూరు చేసినట్లు ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ బుధవారం తెలిపారు. ఈ నిధులతో ఐఐటీ ప్రాంగణంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామన్నారు. '2015లో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐఐటీల్లో తిరుపతి ఐఐటీ ఒకటి. 2017-24 వరకు కేంద్ర ప్రభుత్వం సుమారు రూ1,100కోట్లు మంజూరు చేసింది. 2017 నుంచి ఏర్పేడు వద్ద ఐఐటీ ప్రాంగణంలో పనులు ప్రారంభమయ్యాయి. ఐఐటీని మరింత అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులను మంజూరు చేసింది. ఇక్కడ చదువుకునే విద్యార్థులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి మా బోధన సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు' అని ఆయన వివరించారు.

స్విమ్స్‌లో రెట్టింపు స్థాయిలో వైద్య సేవలు

- ఖాళీ పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తాం
- గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో టీటీడీ చైర్మన్, ఈవో

తిరుపతి(వైద్యం), మే 14(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో రోగులకు రెట్టింపు స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలను అందించి, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించేలా సహకరిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. స్విమ్స్‌లో ఆయన అధ్యక్షతన బుధవారం జరిగిన గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఉన్నత వైద్య సేవలపై టీటీడీ మాజీ ఈవో ఐవీ సుబ్బారావు అధ్యక్షతన నిపుణుల కమిటీ మూడు నెలలు అధ్యయనం చేసి నివేదిక ఇచ్చిందన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు నిర్ణయాలు చేపడతామన్నారు. స్విమ్స్‌కు ఏటా రూ.వంద కోట్ల వరకు టీటీడీ వెచ్చిస్తున్నట్లు ఈవో శ్యామలరావు తెలిపారు. ఇక్కడ వైద్య సేవలు పొందేవారిలో ఎక్కువ మంది నిరుపేద రోగులే ఉన్నారన్నారు. భావి అవసరాలను దృష్టిలో పెట్టుకొని స్విమ్స్‌లో ప్లాన్ ప్రకారం నూతన భవనాల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. అన్ని విభాగాల పరిధిలో ఖాళీగా ఉన్న 597 పోస్టులను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ఈ సమావేశానికి ముందు 391 పడకల నూతన క్యాన్సర్ భవనాన్ని, అందులోని 5 ఆపరేషన్ థియేటర్లను, స్విమ్స్‌లోని పలు విభాగాలను, వైద్య పరికరాలను టీటీడీ చైర్మన్, ఈవో పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. ఈ సమావేశానికి ఎక్స్‌పర్ట్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఐ.వీ.సుబ్బారావు, సభ్యులు డాక్టర్ జేఎస్ఎన్‌మూర్తి, తేజోమూర్తుల రామోజీ, విజయ్‌కుమార్, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, టీటీడీ సభ్యుడు సదాశివరావు, జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ హాజరవగా, ఆరోగ్యశాఖ స్పెషల్ సీఎస్ కృష్ణబాబు, టీటీడీ సభ్యురాలు సుచిత్ర ఎల్లా, ఎండోమెంట్ సెక్రటరీ వినయ్‌చంద్ వర్చువల్‌గా పాల్గొన్నారు.



అధికారులతో కలిసి గవర్నింగ్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్న టీటీడీ చైర్మన్, ఈవో

17 నుంచి కల్యాణ వెంకన్న వసంతోత్సవాలు

చంద్రగిరి, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు వసంతోత్సవాలు నిర్వహించనున్నారు. ఉదయం 8.30 గంటలకు ఉత్సవర్లను ఆలయం నుంచి వసంత మండపానికి వేంచేపు చేస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, సీతాలక్ష్మణ, హనుమాన్ సమేత శ్రీరామ చంద్రమూర్తి, రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి ఆస్థానం నిర్వహిస్తారు. 18వ తేదీ సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు స్వర్ణ రథోత్సవం కన్నులపండువగా జరగనుంది. రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఊంజల్ సేవ, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వీధి ఉత్సవం నిర్వహిస్తారు. పాల్గొనదలిచిన భక్తులు రూ.516 చెల్లించాల్సి ఉంటుంది. ఉత్తరీయం, రవికె, అన్నప్రసాదం బహుమానంగా అందజేస్తారు. కాగా, వసంతోత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు కల్యాణోత్సవం, ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది.


యువతకు ఉపాధి కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని డిగ్రీ, ఇంజనీరింగ్, యూనివర్శిటీ కళాశాలల్లో ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా ఫీచర్ స్కిల్స్ ప్రణాళికలు రూపొందించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు, ఏపీఎస్ఎస్‌డీసీ కోఆర్డినేటర్లకు బ్యాడ్జీలు, సర్టిఫికెట్లను బుధవారం కలెక్టర్ అందించారు. నీతి ఆయోగ్ గౌరవ సలహాదారు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జిల్లాలో ప్రతిసిద్ధ చెందిన విద్యాసంస్థలలో నాస్కాం ఫీచర్స్ స్కిల్స్ అనుసంధానం కోసం చర్యలు తీసుకుని భవిష్యత్తులో విద్యార్థులు అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటి కోర్సులను చేయడం వల్ల ఉపాధి అవకాశాలు ఎక్కువగా వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో నాస్కాం డైరెక్టర్ ఉదయ్‌శంకర్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లోకనాథం తదితరులు పాల్గొన్నారు.

వెటర్నరీలో వీసీఐ సభ్యుల తనిఖీ



తిరుపతిరూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ కళాశాలను బుధవారం వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృంద సభ్యులు పరిశీలించారు. మూడ్రోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు వీసీఐ సభ్యులు డాక్టర్ తంగ్రివేలు, మహారాష్ట్ర వెటర్నరీ అండ్ అనిమల్ సైన్సెస్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎస్వీ అవంధ్కర్ కలసి 10 కళాశాలల్లో డిపార్ట్‌మెంట్లను తనిఖీ చేశారని అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఫ్యాకల్టీ, సదుపాయాలు, ల్యాబ్‌ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారన్నారు. వర్సిటీ ఇన్‌చార్జి డీఆర్ ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత, ప్రొఫెసర్ ఎంవీఏఎన్ సూర్యనారాయణ పాల్గొన్నారు.



విశ్వరూపానికి హారతి

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనరు మౌర్య

విశ్వరూప దర్శనానికి భక్తుల నిరీక్షణ

అమ్మవారి విశ్వరూపానికి వేసిన తెర

ఆలయానికి వస్తున్న పేరంటాల వేషధారి

విశ్వరూపం వద్దకు పేరంటాల వేషధారి సాంబ

కమిషనరు మౌర్యకు మట్టి అందిస్తున్న పేరంటాలు

చెంప తాకుతున్న సాంబ

ప్రతిమ మన్నును భక్తులకు పంచేసిన నిర్వాహకులు

మన్నుకోసం ఎగబడుతున్న భక్తులు

● ఫెస్టివ్ వైబ్స్ అదుర్స్

జాతర.. జయప్రదం

తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి గంగ జాతర జయప్రదమైంది. మంగళవారం ఒక్కరోజే లక్ష మందికిపై భక్తులు గంగమ్మను దర్శించుకున్నట్టు అంచనా. గతం కంటే పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తినా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాతర క్రతువు ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ఈనెల 6వ తేదీన అర్ధరాత్రి అవిలాల నుంచి చాటింపుతో గంగజాతర సంబరం మొదలైంది. వారం రోజులపాటు జాతర వైబ్స్ నగరంతో పాటు చుట్టుపక్కల పల్లెలను చుట్టుముట్టాయి. రోజుకో వేషం.. చిత్ర, విచిత్రమైన అలంకారాలతో పలువురు భక్తులు గంగమ్మను దర్శించుకున్నారు. అక్కడక్కడా అలకలు, అరుపులు మినహా జాతర ఆద్యంతం అదిరిపోయింది. ఇక, వైకుంఠ దర్శన టోకెన్ల జారీలో దుర్ఘటన, ఇటీవల సింహాచలంలో గోడకూలిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య గంగజాతరపైనే ఫోకస్ పెట్టారు. 300 మంది పోలీసు బలగాలను మోహరింపచేశారు. ఆలయ పరిసరాలు శుభ్రంగా పెట్టేందుకు 200 మంది పారిశుధ్య సిబ్బంది ఏర్పాటుచేశారు. సచివాలయ ఉద్యోగులనూ జాతర విధులకు కేటాయించారు. ఇక, జాతర బాధ్యతలు చేపట్టిన కమిషనరు మౌర్య, అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకున్నారు. వీఐపీ పాసులు లేకుండా చేశారు. ఉత్సవ కమిటీ సభ్యుల సపరివార సమేత హడావుడిని తగ్గించారు.

అప్పుడు రూ.2కోట్లు.. ఇప్పుడు రూ.20లక్షల్లోపే

వైసీపీ హయాంలో జరిగిన జాతరకు దాదాపు రూ.2 కోట్లు ఖర్చు పెట్టారు. సామూహిక జంతుబలులిచ్చి తెగిన తలలపై కర్పూర హారతులతో ఆలయ పరిసరాలను భీతావహంగా మార్చారు. వైసీపీ శ్రేణులే ఆలయం చుట్టూ చేరి హడావుడి చేసి, సామాన్య భక్తులకు చుక్కలు చూపించారు. ఈసారి జాతర ఖర్చు రూ.20లక్షల్లోపేనని ఆలయ అధికారులు చెబుతున్నారు. టీటీడీ, తుడా, కార్పొరేషన్ నుంచి ఎలాంటి ఆర్థికసాయం తీసుకోలేదు. సామాన్య భక్తులూ ఇబ్బంది పడిన సందర్భాలు కనిపించలేదు. సాధారణ క్యూలైన్‌లోని భక్తులకూ పది, పదిహేను నిమిషాల్లో అమ్మవారి దర్శనం అయింది.

క్రౌడ్ మేనేజ్మెంట్‌పై దృష్టిపెట్టాం

జాతర రోజున క్రౌడ్ మేనేజ్మెంట్‌పైనే దృష్టిపెట్టాం. పోలీసులదే ఆ క్రెడిట్. అదనపు బలగాలు మోహరించి క్యూలైన్లలో భక్తులు పడిగాపులు లేకుండా చూశాం. వీఐపీ లైను లేకుండా సాధారణ భక్తులనూ వదిలేయడంతో ఆలయప్రాంగణంలో రద్దీని తగ్గించగలిగాం. టీటీడీ ఏర్పాటు చేసిన గ్యాలరీలు ఉపయోగపడ్డాయి. విశ్వరూపం తయారు చేసేందుకు కొంత సమయం దర్శనం ఆపాల్సివచ్చింది. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా జాతర జయప్రదం కావడం సంతోషంగా ఉంది.

- మౌర్య, కార్పొరేషన్ కమిషనర్

తాత్కాలిక హుండీ ఆదాయం రూ10.66 లక్షలు

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీని బుధవారం సాయంత్రం లెక్కించారు. వీటిద్వారా రూ10.66లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్టు అధికారులు తెలిపారు. శాశ్వత హుండీలను గురువారం లెక్కించనున్నారు.

హోం స్టేలకు చట్టబద్ధత అవసరం

తిరుపతి(నేరవిభాగం), మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొత్త విధానంలో ఏర్పాటవుతున్న హోం స్టేలకు చట్టబద్ధత అవసరమని జీఎస్టీ జాయింట్ కమిషనరు జాన్ స్టీవెన్సన్ పేర్కొన్నారు. తిరుపతిలో ఇటీవల హోటళ్లు, లాడ్జీలకు పోటీగా ఏర్పాటవుతున్న హోంస్టేలకు పన్నులు, ఇతర వివరాలు నిర్వాహకులు సమర్పించడం లేదని గమనించిన జీఎస్టీ సహాయ కమిషనరు శ్రీనివాసులు నాయుడు వీటిని క్రమబద్ధీకరించి, ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం దాదాపు 100 మంది హోంస్టేల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. హోంస్టేలకు జీఎస్టీ అధికారుల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రోజుకు రూ.7500 అద్దె ఉన్న గదులకు 12 శాతం.. ఆపై వాటికి 18 శాతం పన్నులు చెల్లించాలన్నారు. 'మా ఇంటిని అద్దెకు ఇస్తే జీఎస్టీ కట్టాలా? మా ఇంట్లో అతిథులకు ఆతిథ్యం ఇస్తే మీకెందుకు జీఎస్టీ కట్టాలి? ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకొన్నప్పుడే పన్ను చెల్లిస్తున్నాం. మళ్లీ ఎందుకు జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి? కేరళలో టూరిజం విభాగం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చి హోం స్టేలను అనుసంధానం చేసేలా మాకూ వెసులుబాటు కల్పించాలి' అని కొందరు నిర్వాహకులు అధికారులను అడిగారు. ఇంటిని కమర్షియల్‌గా అద్దెకు ఇస్తే జీఎస్టీ చెల్లించాలని జీఎస్టీ జేసీ జాన్ స్టీవెన్సన్ స్పష్టంచేశారు. రూ.20 లక్షల కంటే ఎక్కువ సంపాదించే వారే జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ అధికారులు రేణుక, నూర్జహాన్, సీటీవో అధికారులు పాల్గొన్నారు.



నిర్వాహకులతో సమావేశమైన జీఎస్టీ జేసీ స్టీవెన్సన్, సహాయక కమిషనరు శ్రీనివాసులు నాయుడు

'ఎర్ర' దొంగకు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) మే 14(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఎర్రచందనం ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి నరసింహమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణమ నాయుడు కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా వీలేరు మండలం మారంరెడ్డిగారిపల్లికి చెందిన అరవ వెంకటనారాయణ రాజు, గుండ్లూరు చెంగల్ రెడ్డి, దళాలి నారాయణ రాజు 2021 జనవరి 11న విఠలం గ్రామం వద్ద ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. అప్పటి వాయల్పాడు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది దాడులు చేశారు. తిరుపతి నుంచి మదనపల్లె వైపు వేగంగా వెళుతున్న కారును ఆపగా, ఆపలేదు. కొంతదూరం వెళ్లాక ఆ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన చింతచెట్టును ఢీకొంది. వాహనంతో పాటు ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ సమయంలోనే గుండ్లూరు చెంగల్ రెడ్డి, దళాలి నారాయణ రాజు మృతి చెందారు. మిగిలిన నిందితుడు అరవ వెంకటనారాయణ రాజుకు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి బుధవారం తీర్పు చెప్పారు.

చిన్నారుల రూ.లక్ష విరాళం



తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్'లో అసువులు బాసిన వీరజవాన్ల సహాయార్థం తిరుపతి నగరానికి చెందిన అనిరుధ్, ఆశ్రీద్, సుచిత్ర రూ.లక్ష అందించారు. ఈ మేరకు చెక్కును బుధవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందజేశారు.

లీడ్ బ్యాంక్ మేనేజర్‌గా రవికుమార్

తిరుపతి(కలెక్టరేట్), మే 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరుగా జి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



కొబ్బరికాయలు సమర్పిస్తున్న పళణిస్వామి

తిరుమల, మే14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళణిస్వామి,కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హెచ్‌పీ మోహన్, బాంబే హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డీ భోజే ఉన్నారు. పళణిస్వామి దర్శనం అనంతరం అఖిలాండం వద్దకు చేరుకున్న కొబ్బరికాయలు సమర్పించారు.

పాలిసెట్, ఏపీఆర్జేసీ ఫలితాల్లో 'విశ్వం' విద్యార్థుల హవా

● ఏపీఆర్‌జేసీలో స్టేట్‌లో టాప్‌టెన్‌లో నాలుగుర్యాంకులు

● పాలిసెట్‌లో జిల్లాస్థాయిలో టాప్ ర్యాంకులు కైవసం



ఏపీఆర్‌జేసీ టాపర్లను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే14 (ఆంధ్రజ్యోతి): ఏపీప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీ ఆర్జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తమ వద్ద శిక్షణ పొందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని తిరుపతిలోని 'విశ్వం' స్కూల్ ఛైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో వై.దేదీప్యకు 3వర్యాంకు, కె.మునిరూపేష్‌కు 7వ, జె.అంజలికి 9వ, మనీషాకు 10వ ర్యాంకు వచ్చిందన్నారు. వీరితోపాటు రేవంత్, అబ్దుల్‌ఖాదర్, యోగి, సమత, దేదీప్య, భవ్య, శ్రీగీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ అత్యుత్తమ ర్యాంకులతో ప్రతిభ చాటారన్నారు. పాలిసెట్‌లో ఎం.కావ్యశ్రీ 120కి117మార్కులతో బాలికలవిభాగంలో జిల్లాలో టాపర్‌గా నిలచిందని ఆయన తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్‌ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారి 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109 మార్కులతో ప్రతిభ చాటారన్నారు. సైనిక్, నవోదయ, మిలటరీస్కూల్ ప్రవేశ పరీక్షలతోపాటు ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లోనూ తమ విద్యార్థులు ఏటా టాప్‌ర్యాంకులు సాధిస్తుండడం సంతోషంగా ఉందన్నారు. పోటీపరీక్షల సమాచారం కోసం 8688888803/02, 9399976999 నెంబర్లలో సంప్రదించాలని కోరారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసివిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లు అభినందించారు.

తిరుమలలో ఒడిశా భక్తుడి అదృశ్యం



నార్సింగ్‌నాయక్

తిరుమల, మే14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఒడిశాకు చెందిన నార్సింగ్ నాయక్(57) అనే భక్తుడు కనిపించకుండా పోయాడు. కోరాపుట్ జిల్లా, ఖతలపడారు గ్రామం నుంచి పది మంది కుటుంబ సభ్యులతో కలిసి 11న ఆయన తిరుమలకు వచ్చాడు. అదేరోజు రాత్రి 8.30 గంటలకు అఖిలాండం వద రద్దీలో కనిపించకుండా పోయాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు తిరుమల వన్‌టౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈయన వివరాలు తెలిసిన వారు 94407 96769, 0877 2289027 నెంబర్లకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

తుడా కార్యదర్శిగా ఎన్వీ శ్రీకాంత్ బాబు



తిరుపతి, మే 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) కార్యదర్శిగా డాక్టర్ ఎన్వీ శ్రీకాంత్ బాబు నియమితులయ్యారు. పశు వైద్యశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ అయిన శ్రీకాంత్ ప్రస్తుతం శ్రీకాళహస్తి ఏరియా వెటర్నరీ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. డెప్యుటేషన్‌పై మున్సిపల్ శాఖకు బదిలీ అయిన ఆయన్ను.. ఖాళీగా వున్న తుడా కార్యదర్శి పోస్టులో ప్రభుత్వం నియమించింది. ఈ పోస్టులో ప్రాథమికంగా ఏడాది పాటు కొనసాగనున్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఇద్దరు మహిళల నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం

రేణిగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు మహిళల నుంచి 24 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు అర్బన్ పోలీసులు తెలిపారు. బుధవారం రేణిగుంటలోని ఓ లాడ్జిలో ఒడిశాకు చెందిన ఇద్దరు మహిళలు అద్దెకు దిగారు. వీరి కదలికలు అనుమానంగా ఉండడంతో సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఆ మహిళల గదిని తనిఖీ చేశారు. రెండు సూట్‌కేసుల్లో 24 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. ఇద్దరు మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విశాఖ ఏజెన్సీలో కొన్న గంజాయిని చెన్నైలో విక్రయించేందుకు తీసుకెళ్తున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏర్పేడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

● ఆగి ఉన్న లారీని ఢీకొన్న కోళ్లవ్యాన్

● ఇద్దరు వ్యాన్ డ్రైవర్ల దుర్మరణం

ఏర్పేడు, మే 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన నిలిచి ఉన్న లారీని కోళ్ల వ్యాను ఢీకొంది. ఈ ప్రమాదంలో కోళ్ల వ్యాను డ్రైవర్, అతడికి సహాయంగా వచ్చిన మరో డ్రైవర్ దుర్మరణం చెందారు. ఈ ఘటన ఏర్పేడు మండలం మేర్లపాక టోల్ ప్లాజా వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి నుంచి శ్రీకాకుళం వెళ్తున్న కోళ్ల వ్యాన్ టోల్‌ప్లాజా వద్ద నేషనల్ హైవే పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ధర్మపురికి చెందిన కృష్ణన్ పెరుమాళ్(55), రామన్ మధు(40) అక్కడికక్కడే మృతి చెందారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కోళ్ల లారీలో ఇరుక్కుపోయిన డ్రైవర్, సహ డ్రైవర్ మృతదేహాలను ఎక్స్‌కవేటర్ సాయంతో వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రామన్‌మధు - కృష్ణన్ పెరుమాళ్ మృతదేహాలు



రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తున్న సీఐ

వాహనం సహా ఎర్రచందనం స్వాధీనం

ఎర్రావారిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) ; శేషాచల అడవుల నుంచి తమిళనాడుకు ఎర్రచందనం తరలిస్తుండగా వాహనం సహా స్వాధీనం చేసుకున్నట్లు భాకరాపేట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వెంకట్రామణ తెలిపారు. మండలంలోని ఎల్లమంద క్రాస్ నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో మంగళవారం రాత్రి ఎల్లమంద గ్రామంలో ఫారెస్టు సిబ్బంది నిఘా ఉంచారు. రాత్రి 11 గంటల ప్రాంతంలో కారు వేగంగా ఎల్లమంద గ్రామం ఇరగంరెడ్డిగారిపల్లె రోడ్డు వైపు వెళుతుండగా వెంబడించారు. తూనికాకుల బండ వద్ద కారును వదిలేసి ఇద్దరు స్మగ్లర్లు పారిపోయారు. కారులో పరిశీలించగా 200 కేజీల బరువున్న 8 ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. వాటి విలువ రూ.10 లక్షలు ఉంటుందని రేంజర్ తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఆర్వో వెంకట్రామణ, ఎఫ్ఎస్వో మునిస్వామి నాయక్, ఎఫ్‌బీవోలు లక్ష్మీప్రసాద్, రాజేష్, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

తిరుమలలో సెక్యూరిటీ ఆడిటింగ్ కమిటీ తనిఖీలు



ఆలయం వద్ద తనిఖీలు చేస్తున్న కమిటీ సభ్యులు

తిరుమల, మే 14 (ఆంధ్రజ్యోతి): దేశ సరిహద్దులో ఉద్రిక్తత నేపథ్యంలో సెక్యూరిటీ ఆడిటింగ్ కమిటీ సభ్యులు బుధవారం సాయంత్రం తిరుమలలో తనిఖీలు నిర్వహించారు. సభ్యులు సునిత్ గరుడ, అరిఫ్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అధికారులతో కలిసి శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధులు, ముఖ్య రద్దీ ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. భద్రతాపరంగా కీలకమైన అలిపిరి తనిఖీ కేంద్రం, కాలినడక మార్గాలు, శ్రీవారి పాదాల మార్గం, హథిరాంజీ మఠం, శ్రీవారి ఆలయ బూందీపోటు, మాడవీధులు, అన్నప్రసాద కేంద్రం, వైకుంఠం1, రింగురోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. మరింత భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

గంగాభవానికి ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 14 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాభవాని ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును ఏపీ నర్సింగ్ కౌన్సిల్ నుంచి పొందారు. నర్సింగ్ రంగంలో ఈమె చేసిన కృషికి గుర్తింపుగా విజయవాడలో గల తుమ్మలపల్లె కళా క్షేత్రంలో చేపట్టిన నర్సుల దినోత్సవ సభలో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ విజయలక్ష్మి

చిట్టమూరు, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ విజయలక్ష్మి అన్నారు. బుధవారం చిట్టమూరు స్త్రీ సంక్షేమ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీవో మనోహర్ గౌడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీటీసీలు, సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని సూచించారు. వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండడంతో తాగునీటి సమస్య లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాలు పడే లోపు చెరువుల మరమ్మతులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇరిగేషన్ ఏఈ లీలా మోహన్ వివరించారు. ఉపాధి పనులకు బిల్లులు విడుదల కాలేదని పలువురు సర్పంచులు ఏపీవో షీలాను నిలదీశారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు వెంకటరమణయ్య, సుబ్బమ్మ, జట్పీటీసీ వెంకటయ్య, తహసీల్దారు శతీష్ కుమార్, ఎంఈవోలు కృష్ణయ్య, వెంకటప్రసాద్, హౌసింగ్ ఏఈ సుధీర్, ఏవో సుచేంద్ర ప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో వెంకటరమణ

కోట, మే 14 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో వంద శాతం పన్నులు వసూలు చేసి స్వర్ణ పంచాయతీల జాబితాలో చేరి ప్రశంసలు అందుకోవాలని డివిజనల్ పంచాయతీ అధికారి వెంకటరమణ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం స్వర్ణ పంచాయతీలపై పంచాయతీ కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎన్‌సీవోలతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీలకు సంబంధించి ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా మండలంలో ఉన్న 8 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను దత్తత తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే బిల్డింగ్ ప్లాన్ అప్రువల్ విషయంలో జీవో నెంబర్ 3, 4పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఇన్‌చార్జి పంచాయతీ విస్తరణ అధికారి కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలగా పున్నేపల్లి యూపీ పాఠశాల

ఓజిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం పున్నేపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఈ విద్యా సంవత్సరం నుంచి ఉన్నత పాఠశాలగా మారనుంది. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు విద్యాశాఖ అధికారులు ధృవీకరించారు. కాగా, పున్నేపల్లిలో 2002లో ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేశారు. తదనంతరం ప్రాథమికోన్నత పాఠశాలగా మారింది. ప్రస్తుతం ఎమ్మెల్యే విజయశ్రీ, పార్టీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం కృషితో ఉన్నత పాఠశాలగా మారింది.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి


అంచనాల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో బుధవారం నిర్వహించిన శాసనసభ అంచనాల కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొని పలు సమస్యలపై చర్చించారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సిమెంటు రోడ్ల పక్కనే కాలువలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఉపాధి బిల్లుల చెల్లింపులు, పంచాయతీల్లో విద్యుత్ వినియోగం తగ్గింపు, కొత్తగా ఏర్పడిన అనుబంధ సంఘాల వీవోఏలకు జీతాల చెల్లింపుల గురించి కమిటీ సమావేశంలో పాల్గొన్న అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరామని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు కార్మికుల సన్మానం


కమిషనర్‌ను సత్కరిస్తున్న వెంకటేశ్వర్లు, కార్మికులు

నాయుడుపేట, మే 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లాకు పదోన్నతి రావడంతో బుధవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చాపల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్మికులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు మధు, రమణమ్మ, ఆరావళి తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మ గ్రామోత్సవం



కోట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొక్కుపాడు పంచాయతీ సూరిశెట్టిపాళెంలో బుధవారం కోటమ్మ గ్రామోత్సవం జరిగింది. మేళతాళాల నడుమ అమ్మవారి ఆభరణాలు, వీరతాళ్లు కలిగిన గంగపెట్టితో పాటు అమ్మవారు సూరిశెట్టిపాళెం పురవీధుల్లో ఊరేగారు. గ్రామస్తులు అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ఖేలో ఇండియా టెన్నిస్ పోటీల్లో లక్ష్మీసిరి ప్రతిభ



మెడల్స్‌తో లక్ష్మీసిరి

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా టెన్నిస్ పోటీల్లో గూడూరుకు చెందిన దండు లక్ష్మీసిరి ప్రతిభ చాటింది. పట్టణంలోని సొసైటీ కాలనీకి చెందిన లక్ష్మీసిరి బిహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహించిన ఖేలో ఇండియా టెన్నిస్ పోటీల్లో పాల్గొని సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం, డబుల్స్ విభాగంలో రజత పతకం సాధించింది.

తాళం వేసిన ఇంట్లో చోరీ

తడ, మే 14 (ఆంధ్రజ్యోతి): తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. తడ కొత్తకుప్పం గ్రామానికి చెందిన దేశప్పన్ సమీప పరిశ్రమలో పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి ఇంటికి తాళంవేసి ఇంటి మిద్దెపైకి వెళ్లి పడుకున్నాడు. బుధవారం ఉదయం కిందకు దిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి, బీరువాలోని వస్తువులు చెల్లా చెదరుగా పడి ఉన్నాయి. చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సుమారు రూ.57వేల విలువైన బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబాగుడి సమీపంలోని చెరువుకట్ట వద్ద బుధవారం రాత్రి ఓ గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు.. సాయిబాబాగుడి సమీపంలోని చెరువు కట్ట వద్ద 55 ఏళ్లకు పైబడిన వృద్ధుడి మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారన్నారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు తెల్ల చొక్కా, గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు.

అస్తవ్యస్తంగా సూళ్లూరుపేట ఆర్టీసీ


సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో

సూళ్లూరుపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సూళ్లూరుపేట డిపోలో నిర్వహణ గాడి తప్పినట్లు తెలుస్తోంది. ఆర్టీసీ నెల్లూరు విజిలెన్స్ అధికారులు వారం కిందట రెండు రోజుల పాటు డిపోలో విస్తృత తనిఖీలు నిర్వహించడంతో అనేక అవకతవకలు బయట పడినట్లు చెప్పుకుంటున్నారు. ఇక్కడ సిబ్బంది ఉద్యోగానికీ, చేసే పనికీ సంబంధమే ఉండదని అంటున్నారు. డిపోలో దాదాపు 8 మందికి పైగా కండక్టర్లు ప్రత్యామ్నాయ విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనలను అనుసరించకుండా అధికారుల ఇష్టానుసారంగా వారికి అనుకూలంగా ఉండే కండక్టర్లను ఓడీల్లోకి తీసుకొని ఏళ్ల తరబడి వారినే కొనసాగిస్తున్నారు. విధులకు హాజరైనట్లు మస్టర్లు వేసి వారికి నెలనెల జీతాలు చెల్లిస్తున్నారని అంటున్నారు. వీరిలో ఒక్కరు తప్ప మిగిలిన 7గురు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నారని చెబుతున్నారు. డిపోలో అనారోగ్యానికి గురై విధులకు హాజరుకాలేని పరిస్థితిలో ఉన్న నలుగురు ఓడీలు కేటాయించాలని కోరినా వారికి అవకాశం ఇవ్వలేదని అంటున్నారు. డిపోలో పట్టుమని 30 సర్వీసులు కూడా లేవు. అందులో 4 సర్వీసులు పాఠశాలలకు చెందినవి. మొత్తం మీద 25 సర్వీసులే తిరిగేవి. అందుకు ఇంతమంది సిబ్బంది ఓడీల్లో అవసరమా అంటూ తోటి ఉద్యోగస్తులే బహిరంగంగా విమర్శిస్తున్నారు.

ఒకేరోజు 30 మంది డుమ్మా

ఇలా ఉండగా ఏప్రిల్ 20న ఒకేరోజు వివిధ మర్గాలకు వెళ్లే 15 బస్సు సర్వీసులను ముందస్తు సమాచారం లేకుండా, ఉన్నతాధికారులకు తెలియకనే రద్దు చేశారు. ఈవిషయాన్ని డిపో అధికారులు గోప్యంగా ఉంచారు. ఈ విషయం కూడా విజిలెన్స్ తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఒకేరోజు విధులు నిర్వహించాల్సిన కండక్టర్లు, డ్రైవర్లు దాదాపు 30 మంది విధులు హాజరుకాకపోతే క్రమ శిక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేదని అధి కారులను ప్రశ్నించినట్లు తెలిసింది. విజిలెన్స్ తనిఖీలనంతరం రికార్డులు మార్చి కొందరు సెలవులు పెట్టినట్లు రికార్డులు సృష్టించినట్లు చెబుతున్నారు.

స్వయం సహాయక సంఘాల సభ్యులకు జీవనోపాధి


పొదుపు సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట, మే 14(ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక గ్రూపుల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం స్వయం ఉపాధి కల్పించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పొదుపు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని 1024 పొదుపు గ్రూపుల్లో 10,290 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. ఇందులో ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. మొదటగా వ్యాపారాలు చేసుకునే వారికి రూ.2 లక్షలు రుణం మంజూరు చేస్తారన్నారు. వ్యాపారాభివృద్ధి, రుణాల చెల్లింపులకు అనుగుణంగా రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. అలాగే పొదుపు గ్రూపుల్లోని మహిళల విద్యార్హత ప్రకారం స్థానిక పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో టౌన్‌మిషన్ కోఆర్డినేటర్(టీఎంసీ) సౌజన్య, కమ్యూనిటీ కోఆర్డినేటర్ (సీవో) నారాయణమ్మ, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత విభేదాలు వీడి పార్టీ కోసం పనిచేయండి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు


సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పల్లా శ్రీనివాసరావు తదితరులు

తడ, మే 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అంతర్గత విభేదాలు వీడి పార్టీని బలోపేతం చేయడంతో పాటు రాష్ట్ర సంక్షేమం, ప్రజా వికాసం కోసం అందరూ కలిసి పనిచేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు విజయశ్రీ, జ్యోతుల నెహ్రూ, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి పాల్గొన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని, ఆయన విజన్‌ను గ్రామగ్రామానికి తీసుకెళ్లే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీలో సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అందరినీ కలుపుకుని వెళ్లడంతో పాటు పార్టీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి సముచితస్థానం కల్పించాలని సూచించారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

గూడూరు అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల వద్ద ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా మనుబోలు గ్రామానికి చెందిన హేమలత (27) భర్తతో గొడవల కారణంగా కొన్నిరోజులుగా అతనికి దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో ఓజిలి మండలం కురుగొండ గ్రామానికి చెందిన రషీద్‌తో పరిచయం అయింది. వీరిద్దరూ గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని సహజీవనం చేస్తున్నారు. రషీద్‌తో మనస్పర్థలు రావడంతో మనస్థాపానికి లోనైన హేమలత మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బుధవారం ఉదయం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్, ఆటో ఢీ: డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలో ఇసుక ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బుధవారం తెల్లవారు జామున బైపాస్‌రోడ్డు సమీపంలో ఇసుక ట్రాక్టర్, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలవడంతో అతనిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు.

అదుపుతప్పి కారు బోల్తా

నలుగురికి గాయాలు

పెళ్లకూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): టైర్ పంక్చర్ కావడంతో కారు అదుపుతప్పి బోల్తా పడింది. మండలంలోని అక్కగారిపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... తాడేపల్లికి చెందిన రామాంజనేయులు, శ్రీనివాసులు, గణపతి, ప్రసాద్ కారులో తిరుమలకు వెళ్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అలాగే శ్రీకాళహస్తి వాయులింగేశ్వరుడిని దర్శించుకుని తిరిగి ప్రయాణమయ్యారు. మార్గమధ్యంలో అక్కగారిపేట సమీపంలో టైర్ పంక్చర్ కావడంతో కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేట నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు.

బాణసంచా దుకాణాల్లో తనిఖీలు


వెంకన్నపాళెంలో టపాసుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ గీతా కుమారి, ఎస్ఐ పవన్‌కుమార్

కోట, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం, చెందోడు గ్రామాల్లో ఉన్న బాణసంచా దుకాణాలను గూడూరు డీఎస్పీ గీతాకుమారి బుధవారం తనిఖీ చేశారు. టపాసుల నిల్వ, విక్రయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎస్ఐ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బైక్ చోరీ

తడ, మే 14 (ఆంధ్రజ్యోతి): సాయిబాబా మందిరం వద్ద నిలిపి ఉన్న బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. వరదయ్యపాళెం మండలం చిలమత్తూరు గ్రామానికి చెందిన రెడ్డి జశ్వంత్ బుధవారం బైక్‌పై సూళ్లూరుపేటకు బయలుదేరాడు. మార్గమధ్యంలో బోడిలింగాలపాడు సాయిబాబా మందిరం వద్ద బైక్‌ను పార్కింగ్ చేసి ఆటోలో వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి బైక్ కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కరిమాణిక్యస్వామికి హంసవాహన సేవ

నాయుడుపేట టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - తుమ్మూ రులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయంలో వార్షికోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు చప్పర ఉత్సవం నిర్వహించారు. రాత్రి హంస వాహనంపై కరిమాణిక్యస్వామి భక్తులకు దర్శనమిచ్చారు.


పశువుల దాణా పంపిణీ


పాడిరైతులకు దాణా అందజేస్తున్న కోటేశ్వరరెడ్డి తదితరులు

డక్కిలి, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై సరఫరా చేసిన పశువుల దాణాను టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరెడ్డి బుధవారం పాడి రైతులకు పంపిణీ చేశారు. స్థానిక పశువైద్యశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సర్వేపల్లి రత్నయ్య, దండవోలు పెంచలరెడ్డి, దుగ్గి వెంకటేశ్వర్లు, పశువైద్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మండల పరిధిలోని కడపత్ర, దామరాయి, కొరిడి పంచాయతీల్లో పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణాను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో కడపత్ర, దామరాయి సర్పంచులు చెంచమ్మ, రమణమ్మ, ఏహెచ్ఏ అనురాధ, టీడీపీ మండల అధ్యక్షుడు కొక్కు శంకరయ్య, నాయకుడు తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షా ఫలితాల్లో స్థానిక ఎల్‌పీపీ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. బుధవారం కరస్పాండెంట్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి సీబీఎస్ఈలో పరీక్షలకు హాజరైన 77 మంది విద్యార్థులు ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణతను సాధించారన్నారు. వీరిలో ఆద్య, వెంకటశరణ్ 474 మార్కులతో పాఠశాల టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుధేష్ణ, హెచ్‌ఎం సురేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

గూడూరు అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో బుధవారం శ్రీకృష్ణసేవాసమితి ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న బస్సు

చంద్రగిరి, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీనివాస మంగాపురం వద్ద బుధవారం కారును బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ గాయాలు కాలేదు. తిరుపతి నుంచి భాకరాపేట వైపు వెళుతున్న కారు ఎదురుగా వస్తున్న బస్సును ఢీకొంది. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలూ కాలేదు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, మే 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై - గూడూరు మార్గంలో కవర్‌పేట, పొన్నేరి మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గురువారం, శనివారం రెండు రోజులపాటు పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు చెన్నై సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు 8.10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమో రైలు నెంబరు 66035, నెల్లూరు నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 10.20 నిమిషాలకు వచ్చే మెమో రైలు నెంబరు 66036, చెన్నై నుంచి సూళ్లూరుపేటకు ఉదయం 5.40 నిమిషాలకు, 10.15 నిమిషాలకు, మధ్యాహ్నం 12.10 గంటలకు చెన్నై నుంచి సూళ్లూరుపేటకు వచ్చే రైళ్లు, అలాగే సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 12.35, 1.15 నిమిషాలకు, 3.10 నిమిషాలకు సూళ్లూరుపేట నుంచి చెన్నైకు వెళ్లే సబర్బన్ రైళ్లను పూర్తిగా రద్దు చేశారు. మరికొన్ని రైళ్లను పొన్నేరి వరకు నడపనున్నారు.

నేడు కురుగొండలో ఎమ్మెల్యే విజయశ్రీ పర్యటన
రూ.90 లక్షల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ఓజిలి, మే 14 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం కురుగొండలో గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పర్యటించనున్నారు. ఈమేరకు ఆమె పర్యటన వివరాలను టీడీపీ మండల కన్వీనరు గుజ్జలపూడి విజయకుమార్ నాయుడు తెలిపారు. కురుగొండ గ్రామంలో రూ.50 లక్షలతో నిర్మించిన రోడ్లు, జలజీవన్ మిషన్ కింద రూ.40 లక్షలతో ఏర్పాటు చేసిన తాగునీటి పైప్‌లైన్, బోరు, మినీ గోకులం షెడ్డును ప్రారంభించనున్నారు.

బైక్‌పై నుంచి పడి మహిళ మృతి

డక్కిలి, మే 14(ఆంధ్రజ్యోతి): మోటారు బైక్‌పై నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన బుధవారం పలుగోడు గ్రామం వద్ద చోటు చేసుకొంది. ఎస్ఐ శివశంకర్ కథనం మేరకు... వెంకటగిరి మండలం సిద్దవరం గ్రామానికి చెందిన ఎల్లంటి మాధవి (34) డక్కిలి మండలం శ్రీపురం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లేందుకు సమీప బంధువైన యోగేష్ అనే యువడి మోటారు బైక్‌లో బయలు దేరింది. పలుగోడు గ్రామం వద్ద వెళ్తుండగా అకస్మాత్తుగా మాధవి కిందపడిపోయింది. ఆమె తలకు బలమైన గాయం తగలడంతో 108 వాహనంలో వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మాధవి మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేనాడులో ముగిసిన మహాలక్షార్చన


గంధాలంకరణలో శ్రీరంగపెరుమాళ్

తడ, మే 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేనాడు దీవిలో వెలసిన శృంగీశ్వర శ్రీరంగ పెరుమాళ్ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న మహా లక్షార్చన బుధవారం ముగిసింది. స్వామివారికి మహా తిరుమంజనం, గంధాలంకారం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వెల్ల డిల్లీబాబు ఉభయకర్తగా వ్యవహరించారు.

వైభవంగా చెన్నకేశవస్వామి రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

గూడూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కర్ణాలవీధిలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవం జరిపారు. భక్తులు రథాన్ని లాగి మొక్కులు చెల్లించుకున్నారు. తూపిలి సురేంద్ర, పద్మజ కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

ఎంఈవో ప్రసాద్‌కు సన్మానం

చిట్టమూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండల రెండవ విద్యాశాఖాధికారి వెంకట ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఎంపీపీ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్, తహసీల్దారు శతీష్ కుమార్, బీవీ రమణయ్య, జట్పీటీసీ వెంకటయ్య, ఎంఈవో కృష్ణయ్య, వైసీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలోఅయ్యప్పస్వామి

గూడూరు అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీలే అవుట్‌లోని ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం భజన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు సురేష్ కుమార్‌రెడ్డి, నందవరం సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి పడకల వితరణ

చిల్లకూరు, మే14(ఆంధ్రజ్యోతి): చిల్లకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో పీవీ.సుధాకర్, ధనుంజయరెడ్డి దాతృత్వంతో బుధవారం బెడ్‌లను అందజేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి అరాఫత్, యల్లసిరి గోపాల్ రెడ్డి, నాసిన నాగులు, చోళవరం గిరిబాబు, పీఎం రావు, సనత్ కుమార్ రెడ్డి, తేజశ్విని, ఉమాపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.